రు. 20/-

నవంబరు 2025

# చైతన్యం

## సంకల్ప బలం

సామాజిక విలువల మాసపత్రిక



కార్తీక శోభలో శ్రీశైలం


జపాన్ మొట్టమొదటి
మహిళా ప్రధాని
టకాయిచి


ASEAN
MALAYSIA 2025
INCLUSIVITY AND SUSTAINABILITY
OPENING CEREMONY
47TH ASEAN SUMMIT AND RELATED SUMMITS
26 OCTOBER 2025
KUALA LUMPUR




వ్యవస్థాపక సంపాదకురాలు

**తీగవరపు శాంతి**

# చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

## నవంబర్ 2025

సంపుటి -15 సంచిక - 2


## ఈ సంచికలో....


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| వార్తా విశేషాలు | 6 |
| మహా మనిషి కొల్లూరి | 31 |
| శ్రీమతి స్వాతీ శ్రీపాద | 33 |
| కాశీ మజిలీ కథలు | 36 |
| అత్యున్నత ప్రజ్ఞ జాగృతం కావాలి | 37 |
| బ్రహ్మ ఖండం | 39 |
| ప్రజాస్వామ్యమా నీవెక్కడ? | 40 |
| కలియుగ ప్రత్యక్ష దైవం | 42 |
| పెంచలకోన | 43 |
| ఒకసారి గాంధీజీ గతంలోకి | 47 |
| మధురస్వప్నం | 49 |
| గజేంద్రమోక్షము | 50 |



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

రెండు తెలుగు రాష్ట్రాలను ముంచేసిన మొంథా

ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలకు అకస్మాత్తుగా వచ్చే వరదల వల్ల ముప్పు ఉందని భారత వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించింది. ముఖ్యంగా మున్నేరు నదిలో భారీ వరదలు వస్తున్నాయని, దీనివల్ల పెనుగంచి-ప్రోలు వంటి పరిసర ప్రాంతాలకు ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించడం జరిగింది.

ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలను తీసుకోవాలని ప్రజలను హెచ్చరించడం జరిగింది. ప్రజలను తగిన జాగ్రత్తలు తీసుకోమని, అలాగే అవసరమైన వారికి కావలసిన సదుపాయాలూ అందిస్తూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు ప్రభుత్వ అధికారులు.

సరే .. కానీ ప్రకృతి వైపరీత్యాల వస్తే, ప్రాజలకు తగిన రక్షణ ఉండాలని, ముందుగానే ఆలోచించి తగిన జాగ్రత్తలు ఎందుకు తీసుకోలేక పోతోంది ప్రభుత్వం? అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతున్న దేశాలను ఆదర్శంగా ఎందుకు తీసుకోలేక పోతున్నాయి? మన ప్రభుత్వాలు.

చిన్న వాన వచ్చినా చెరువులను తలపించే రోడ్లు, పడిపోయిన ఇళ్లూ, కరెంటు స్తంభాలు, మునిగి పోతున్న పంటలు, ఆస్తి నష్టం, ప్రాణ నష్టం , ఆ తరువాత మిమ్మల్ని ఆదుకుంటున్నామని ప్రభుత్వం, మరల రాష్ట్ర ప్రభుత్వాలు అప్పుల పాలవడం, పన్నులు పెంచడం, వస్తువుల రేట్లు పెరగడం, సామాన్యుడు బతకలేనంటూ రోడ్డెక్కడం, పేదవారికి బతుకు తెరువుగా ప్రభుత్వ ఫించను ... ఇలా ఒకదానికొకటి లింక్ లు ఉండి, దేశ పరిస్థితి అల్లకల్లోలమవుతోంది కదా !

మన దేశంలో ప్రజలందరు పడుతున్న ఇబ్బందులను ముందుగానే గుర్తించి, రోడ్లు మరమ్మత్తు చెయ్యడం, పేదవారికి సౌకర్యంగా ఇళ్లు ఇలాంటి అవసరాలను ప్రభుత్వం ముందుగానే గుర్తించి ముందుగానే తగిన చర్యలు తీసుకుంటే, ఇంత నష్టం జరగదు కదా! అనేది విశ్లేషకుల వాదన.

ప్రభుత్వం దగ్గర ఒక్కసారి ఖర్చు చేయడం కష్టం కావచ్చు, మెల్లగా వాటి మీద దృష్టి పెడితే, ఇంత ఆర్ధికంగా కూడా ఖర్చు అయ్యేది కాదు అని విశ్లేషకులు అంటున్నారు. ఏపీలో వరదలకు ప్రధాన కారణం.. కుండపోత వర్షాల కారణంగా నదులు ఉప్పొంగడం. అయితే నదీ తీర ప్రాంతాల్లో జన వాసులు ఏర్పడటం, పట్టణీకరణ వేగంగా పెరుగుతుండటం సమస్యను మరింత క్లిష్టం చేస్తోంది.

తెలంగాణలో కూడా రైతులు ఊహకందని రీతిలో చేతికొచ్చిన పంట నష్ట పోయారు. తెలంగాణ లోని మంత్రులు రైతులను కలిసి ఆవేదన చెందవద్దని , ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని హామీ ఇస్తోంది.

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్ తెలంగాణ రాష్ట్ర మంత్రి గా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజభవన్ లోని దర్బార్ హాల్ లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అజారుద్దీన్ తో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం అజారుద్దీన్ ను గవర్నర్, ముఖ్యమంత్రి పుష్ప గుచ్ఛంతో అభినందించారు. మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారుగా, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావును సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమించింది. ఈ మేరకు రామ కృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు.

జాతీయ అంతర్జాతీయ వార్తలు :

ఒక పక్క రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రకృతి విజృంభించి, పంటలు, పశు పక్ష్యాదులు, నివాసిత ప్రాంతాలు, ఎలక్ట్రిక్ స్తంభాలు ఇలా చెప్పుకుంటూ పోతే ఒకటేమిటి? అనేక రకాలుగా ధ్వంసం చేసింది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాలు ముందుగా ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, అపార నష్టం జరిగింది. పేద ప్రజలు కన్నీరుమున్నీరవుతున్నారు.

ప్రభుత్వం అండగా ఉంటామని ఎంత చెప్పినా, ప్రజలకు జరిగిన నష్టం అంతా ఇంతా కాదు.మరో పక్క రోడ్లు ధ్వంసం అయిపోయి, భారీ వర్షాలకు నీరు వరదలై పారుతూ, రోడ్లు, ఇళ్ళు నీటిలో మునిగి పోవడం, ఆ రోడ్లు పాడవడంతో వాహనాలు పాడవడమే కాకుండా, ప్రజలు ఆ రోడ్లల్లో నడవలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు.

సముద్రం పొంగి, బీచ్ ల దగ్గర ఉన్నవారు, ప్రతి సారి ఇల్లు ఖాళీ చేయడం, అక్కడ ప్రజలు కూడా ఎన్నో రకాల ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాదు చేనేత కార్మికులు ఆ మగ్గాలు, పనిముట్లు, ఆ వస్త్రాలు సైతం తడిసిపోయి అనేక ఇబ్బందులు పడుతున్నారు.

పంట చేతికి వచ్చే సమయానికి ఈ ప్రకృతి విలయతాండవం చేయడంతో, పంటలు నీళ్ళల్లో మునిగి పోతే, వాటిని మునిగిన నీళ్లలో వదల్లేక, ఆ నీళ్లలోంచి తీసుకోలేక వారు పడే ఇబ్బంది వర్ణనాతీతం.

సైంటిఫిక్ గా ఎన్నో కనిపెడుతున్న మన శాస్త్రవేత్తలు గాని, ఇన్వెంటర్స్ గానీ, ఎవరైనా గాని పొలాల్లో పంటలు ఈ విధంగా ఉన్నప్పుడు వాటిని కాపాడుకునే మార్గాన్ని తొందరగా కనిపెట్టాలని కోరుకుందాం.

జాతీయ అంతర్జాతీయ వార్తలు:

భారత 53 వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ని నియమిస్తూ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జస్టిస్ సూర్యకాంత్ నవంబర్ 24 న సీజేఐ గా పదవీ ప్రమాణం చేస్తారు. ఉక్రెయిన్ తూర్పు భాగంలోని రెండు కీలక నగరాలను తమ దళాలు చుట్టు ముట్టాయని రష్యా అధ్యక్షుడు 'వ్లాదిమిర్ పుతిన్' ప్రకటించగా, ఈ ప్రకటనను ఉక్రెయిన్ సైన్యం ఖండించింది.

సైనిక ఆస్పత్రిలో గాయపడిన సైనికులతో బుధవారం పుతిన్ మాట్లాడుతూ, యుద్ధంలో ఏం జరుగుతుందో చూడడానికి పశ్చిమ దేశాల, ఉక్రెయిన్ పాత్రికేయులను అనుమతించడానికి తాము సిద్ధమని తెలిపారు.

అమెరికా, చైనా అధినేతలు డొనాల్డ్ ట్రంప్, జిన్ పింగ్ ల భేటీ దక్షిణ కొరియాలోని బుసాన్ లో గురువారం జరిగింది. వారి మధ్య సయోధ్య కుదరడంతో, ఫెంటానిల్ లో ఉపయోగించే రసాయనాలను అమెరికాకు ఎగుమతి చేస్తున్నందుకు ప్రతిగా విధించిన 20 శాతం సుంకాల్లో 10 తగ్గిస్తానని ట్రంప్ తెలిపారు.

అమెరికా వర్క్ పర్మిట్ నిబంధనలు కఠినతరం:

ఆటోమేటిక్ గా రెన్యువల్ సదుపాయం రద్దు: కాలపరిమితి ముగిసిన వర్క్ పర్మిట్లు ఆటోమేటిగ్గా రెన్యువల్ అయ్యే పద్ధతికి అమెరికా ప్రభుత్వం స్వస్తి పలికింది. ఈ నిర్ణయం వల్ల పెద్ద సంఖ్యలో ప్రవాస భారతీయులు, కార్మికులపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది.

వలసలపై కఠిన నిబంధనల్లో భాగంగా అమెరికా ప్రభుత్వ హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ విభాగం ఈ నిర్ణయం తీసుకుంది. అంతేకాదు , భారత్ ను నిందిస్తూ లేబర్ డిపార్ట్మెంట్ ఎక్స్ వేదికగా ఒక యాడ్ వీడియోను విడుదల చేసింది.

ఈ క్రమంలోనే హెచ్ 1 బి వీసాదారులను ఉద్దేశించి అమెరికన్ యువత స్థానంలో విదేశీ కార్మికులతో భర్తీ చేస్తున్నాయని నిందించింది. మాస్ డిపోర్టేషన్ అరెస్టులు, చట్టపరమైన ప్రవేశాలపై ఆంక్షలు, ఇలా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గర్నుండి వలసదారులపై విరుచుకు పడుతున్నారు.

మరో పక్క పాక్ ఆక్రమిత కాశ్మీర్ లో నిరసనలు. పాక్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్ లోని పౌరులు పాకిస్తాన్ సైన్యం యొక్క ఆకృత్యాలకు వ్యతిరేకంగా, తమ హక్కుల కోసం పెద్ద ఎత్తున పోరాటం, మరియు నిరసనలు చేస్తున్నారు.

ఈ నిరసనలు హింసాత్మకంగా మారడంతో పాక్ బలగాలు ,కాల్పులు జరపగా, పలువురు పౌరులు మరణించారు. అక్టోబర్ 26 రాత్రి జమ్మూ కాశ్మీర్ లోని లీపా వ్యాలీలో భారత్ స్థావరాలపై పాకిస్తాన్ కాల్పులకు పాల్పడింది. దీనిని భారత సైన్య సమర్ధవంతంగా తిప్పి కొట్టింది. నియంత్రణ రేఖ వెంబడి పాక్ సైన్య కవ్వింపు చర్యలు కొనసాగుతుండడంతో భారత్ ఆర్మీ అప్రమత్తమైంది.

భారతదేశం ప్రకృతి వైపరీత్యాల వల్ల, దేశ విదేశాల్లోని క్లిష్ట పరిస్థితుల వల్ల అనేక ఇబ్బందులుఎదుర్కుంటోంది. ఇక్కడ ఉన్న భారతీయ విద్యార్థులు, యువతలకు అమెరికా వంటి విదేశాలకు వెళ్లాలని ఉవ్విళ్లూరుతుంటారు.

అక్కడకు వెళ్లి, కొన్నాళ్ళు ఉన్నాక. వీసాలు వచ్చిన వారు మన భారత దేశం రావాలనుకునే వారు కూడా చాలామంది ఉన్నారు. అయితే అక్కడ సిటిజెన్ షిప్ ఉన్న వారికి మన దేశంలో పౌరసత్వం కూడా ఉంటే మాకు ఇంకా బావుంటుంది అనేది ఎన్నారై ల అభిప్రాయం.



మన భారత దేశం ద్వంద పౌరసత్వం కల్పిస్తే మాకు ఇంకా బావుంటుంది అని అక్కడి భారతీయుల అభిప్రాయం. దీనివల్ల భారత దేశానికి కూడా అక్కడి వారు ఇక్కడకు వచ్చి, డాలర్లు ఖర్చు చేస్తే, మన దేశానికీ మంచిది కదా! ఈ విషయాన్ని ప్రభుత్వం కూడా ఆలోచించి ద్వంద్వ పౌరసత్వం కల్పిస్తుందని ఆశిద్దాం .ప్రజలందరికీ కా ర్తీక మాస శుభాకాంక్షలు అందిస్తోంది మీ చైతన్యం సంకల్పబలం.

సర్వేజనా సుఖినోభవంతు

# వార్తా విశేషాలు

## తీరం దాటిన 'మొంథా' తుపాను





బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా ఏర్పడిన మొంథా తుపాను... నరసాపురం వద్ద తీరం దాటింది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత.. సుమారు 12.30 గంటల ప్రాంతంలో తుపాను తీరం దాటినట్లు అధికారులు ప్రకటించారు. తీరం దాటే ప్రక్రియ దాదాపు మూడు నుంచి 4 గంటలపాటు సాగింది. దాదాపు 18 గంటలపాటు తీవ్ర తుపానుగా కొనసాగింది. తీరం దాటే సమయంలో గరిష్ఠంగా గంటకు 82 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. దీంతో తీరప్రాంతమంతా అల్లకల్లోలమైంది. మరికాసేపట్లో తుపానుగా.. సాయంత్రానికి వాయుగుండంగా బలహీన పడుతుందని భారత వాతావరణ విభాగం తెలిపింది. భూమిమీద ఉత్తర వాయువ్యంగా తెలంగాణ మీదుగా ప్రయాణించి ఇవాళ మధ్యాహ్నం ఛత్తీస్‌గఢ్ వద్ద మరింత బలహీన పడుతుందని ఐఎండీ వెల్లడించింది. ఈదురుగాలుల ప్రభావం తీవ్రంగా ఉంటుందని, గంటలకు 90 నుంచి 95 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని భారత వాతావరణ విభాగం ప్రకటించింది. తుపాను ప్రభావంతో గడిచిన 12 గంటల్లో నెల్లూరు జిల్లా కావలిలో అత్యధికంగా 23 సెంటీమీటర్లు, ఉలవపాడులో 17 సెం.మీ, చీరాలలో 15 సెం.మీ వర్షపాతం నమోదు అయింది. కోస్తాంధ్ర తెలంగాణలోని అన్ని జిల్లాల్లో రెడ్ అలర్ట్ జారీ చేశారు. తుపాను ప్రభావంతో ఏపీ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు పడుతున్నాయి. రాగల 24 గంటల్లో ఏపీ, తెలంగాణ, ఒడిశా, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో వర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది

## మొంథా ఎఫెక్ట్.. తెలంగాణలో 16 జిల్లాలకు ఫ్లాష్ ఫ్లడ్ ముప్పు

మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. తాజాగా రాష్ట్రంలో 16 జిల్లాలకు ఫ్లాష్ ఫ్లడ్ ముప్పు ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కరీంనగర్, సిద్ధిపేట, వరంగల్, జనగామ, యాదాద్రి భువనగిరి, హనుమకొండ, మహబూబాబాద్, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, పెద్దపల్లి జిల్లాలకు వరద ముప్పు ఉన్నట్లు పేర్కొంది. ఈ క్రమంలోనే వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్, సిద్ధిపేట, జనగామ, యాదాద్రి భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, సూర్యాపేట జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. కుమురం భీం ఆసిఫాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, రంగారెడ్డి, నల్గొండ, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఈరోజు ఉదయం నుంచి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతలలో అత్యధికంగా 20.8 సెం.మీ. వర్షపాతం నమోదైంది. అమ్రాబాద్‌లో 19.7 సెం.మీ, వెల్టూర్‌లో 18.3 సెం.మీ, ఐనోలులో 17.8 సెం.మీ వర్షంపాతం నమోదైంది. నల్గొండ జిల్లా తెల్దేవరపల్లిలో 18.5 సెం.మీ ఎర్రారంలో 15.1, పోలేపల్లిలో 13.3 సెం.మీ వర్షం కురిసింది. రంగారెడ్డి జిల్లా వెలిజాలలో 13.9, వనపర్తి జిల్లా రేవల్లిలో 12.6, మహబూబ్ నగర్ జిల్లా మిడ్జిల్‌లో 11.9 సెం.మీ వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్ జిల్లాలోని గార్ల, బయ్యారం, ఇనుగుర్తి మండలాల్లో వర్షం ప్రభావం ఎక్కువగా ఉంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో నిన్న రాత్రి నుంచే వర్షం మొదలైంది. దేవరకొండ మండలం కొమ్మపల్లిలో కుండపోత వానలతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొమ్మపల్లి గురుకుల పాఠశాల చుట్టూ వర్షపు నీరు చేరింది. పాఠశాలలో 300 మంది విద్యార్థులు ఉండడంతో అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం తడిసి ముద్దయింది. కామరెడ్డి జిల్లా బిక్కనూర్, బీబీపేట, దోమకొండ మండలాల్లోనూ ఉదయం నుంచే భారీగా వర్షం కురుస్తోంది. సూర్యపేట జిల్లాల్లో మూసీనదికి వరద ఉధృతి పెరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రాజెక్టు 8 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

## మొంథా తుపాను ప్రభావం.. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో వర్షాలు

ఒడిశాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ మేరకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న మూడు రోజు పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్గఢ్, పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే సౌరాష్ట్ర, కచ్, విదర్భ, గుజరాత్, బీహార్, జార్ఖండ్, కొంకణ్, గోవా, మధ్య మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, మరాఠ్వాడాలలో కూడా ఇలాంటి పరిస్థితులు ఉంటాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ నెల 31 వరకు లక్షద్వీప్, అండమాన్, నికోబార్ దీవులు, కర్ణాటక తీరప్రాంతం, తూర్పు రాజస్థాన్, తూర్పు ఉత్తరప్రదేశ్, ఈశాన్య ప్రాంతాలలో మెరుపులతో కూడిన వర్షాలు, ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఇది రానున్న ఆరు గంటల్లో తుపానుగా బలహీన పడనుందని వెల్లడించింది. తీరం దాటినప్పటికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది.

## ముఖ్యమైన  గీతం వందేమాతరం



బంకిం చంద్ర చటోపాధ్యాయ

స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను ఉత్తేజపరిచిన ఒక ముఖ్యమైన  గీతం వందేమాతరం ప్రసిద్ధి పొందింది. బంకిం చంద్ర చటోపాధ్యాయ రచించిన ఈ పాట 1875లో బెంగాలీ నవల 'ఆనందమఠం'లో తొలుత ప్రచురితమైంది. 1896 లో గురుదేవులు రవీంద్రనాథ్ ఠాగూర్  మొదటిసారిగా ఈ గీతాన్ని ఆలపించారు. స్వరాజ్యం సంగ్రామంలో భారతదేశ ప్రజలను ఏకం చేయడానికి, మాతృభూమికి ప్రాతినిధ్యం వహించే జాతీయవాద భావనను పెంపొందించడానికి ఈ గీతం చిహ్నంగా నిలిచింది. 1950లో భారత రాజ్యాంగ సభ ఈ గీతంలోని తొలి రెండు చరణాలను జనగణమనతో సమానమైన హోదాతో భారత జాతీయ గీతంగా ఆమోదించింది. నవంబర్ ఏడవ తేదీన వందేమాతరం 150వ సంవత్సరాన్నిపూర్తి  చేసుకోనుంది.

## నేడు (అక్టోబర్ 24)  ప్రపంచ పోలియో దినోత్సవం

ఒకప్పుడు పోలియో మహమ్మారి ప్రపంచాన్ని వణికించింది. పోలియో వైరస్ ఐదేళ్లలోపు చిన్నారులను అత్యధికంగా ప్రభావితం చేస్తుంది. ఈ పోలియోను సమూలంగా తరిమి కొట్టడంలో టీకాల మీద అవగాహన పెంచడానికి ప్రతి ఏడాది అక్టోబర్ 24న ప్రపంప పోలియో దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. పోలియో ఒక ప్రాణాంతక అంటువ్యాధి. పోలియో అంటే బూడిద.'మైలోన్' అంటే మజ్జ. ఎముక మజ్జలో ఈ వ్యాధి మొదలవుతుంది కాబట్టి దీనిని పోలియోవైరస్ లేదా పోలియోమైలిటిస్. వెన్నెముక్క, మెదడు కాండంలోని నరాలపై దీని ప్రభావం ఉంటుంది. వ్యాధి బారిన పడిన వ్యక్తి అవయవాలను కదపలేక పోవడం,శ్వాస



తీసుకోవడంలో ఇబ్బంది పడడం, కొన్నిసార్లు ఇది తీవ్ర స్థాయికి చేరి మరణానికి దారితీసే ప్రమాదం కూడా ఉంది. పోలియోమైలిటిస్ ముదిరితే పక్షవాతం అవుతుంది. పోలియోకు ట్రీట్మెంట్ లేదు. కానీ, టీకాల ద్వారా దీనిని పూర్తిగా నివారించవచ్చు. ఇది ప్రధానంగా ఐదేళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలను ప్రభావితం చేస్తుంది. అయితే ఇప్పటికీ కొన్ని దేశాలు పోలియో



జోనాస్ సాల్క్

మహమ్మారితో బాధపడుతున్నాయి. ప్రతి ఏటా అక్టోబర్ 24 న ప్రపంచ పోలియో దినోత్సవాన్ని జరుపుకుంటారు. పోలియో వ్యాక్సిన్ను 1955లో వైద్య పరిశోధకుడు జోనాస్ సాల్క్, ఆయన బృందం తయారు చేయగా 1961లో వాడుకలోకి వచ్చింది. ఆ తర్వాత ఓరల్ వ్యాక్సిన్ను ఆల్బర్ట్ సబిన్ అందించారు. ప్రాణాంతక, నివారణలేని వ్యాధికి సహేతుకమైన మందు కనిపెట్టిన జోనాస్ సాల్క్ పుట్టినరోజు సందర్భంగానే అక్టోబర్ 24న ప్రపంచ పోలియో దినోత్సవాన్ని జరుపుకోవాలని డబ్ల్యుహెచ్ఒ, గ్లోబల్ కమ్యూనిటీ కలసి నిర్ణయించాయి.

ప్రపంచ వ్యాప్తంగా సేవ, సద్భావన, శాంతి, అవగాహనను పెంపొందించేందుకు ప్రపంచ సేవా సంస్థ రోటరీ ఇంటర్నేషనల్ పోలియో దినోత్సవాన్ని ప్రారంభించింది. దాదాపు మూడు దశాబ్దాల నుంచి ప్రపంచమంతటా కేంద్ర ప్రభుత్వాలు, డబ్ల్యుహెచ్ఒ నాయకత్వంలో గ్లోబల్ పోలియో నిర్మూలనా ఇనిషియేటివ్.. వ్యాధి నిర్మూలనా చర్యలు చేపట్టాయి. పోలియో వ్యాక్సిన్ గురించి అవగాహన పెంచడం, వ్యాధిని పూర్తిగా నిర్మూలించడం వీటి లక్ష్యం. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం.. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ పోలియో వ్యాధికి చివరి అడ్డాలుగా మిగిలిపోయాయి. ఈ దేశాల్లో వైల్డ్ పోలియో వైరస్ ఇంకా ప్రబలంగా ఉంది. ఈ దేశాలలో ప్రతి సంవత్సరం పదుల సంఖ్యలో కొత్త కేసులు నమోదవుతూనే ఉన్నాయి, ఎందరో చిన్నారులు శాశ్వత వైకల్యం బారిన పడుతున్నారు. వీటితో పాటు, నైజీరియా వంటి కొన్ని ఆఫ్రికన్ దేశాల్లో అడపాదడపా కేసులు వెలుగు చూస్తున్నా అక్కడి ప్రభుత్వాలు కఠిన చర్యలతో పరిస్థితిని అదుపులోకి తెస్తున్నాయి. ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ లోని కొన్ని ప్రాంతాల్లో కొనసాగుతున్న అంతర్యుద్ధం, ఉగ్రవాద కార్యకలాపాలు టీకా కార్యక్రమాలకు పెను సవాలుగా మారాయి. ఆరోగ్య కార్యకర్తలు మారుమూల గ్రామాలకు వెళ్ళలేని పరిస్థితి నెలకొంది. టీకాలపై ప్రజల్లో ఉన్న అపోహలు, నిరక్షరాస్యత, మతపరమైన తప్పుడు ప్రచారాలు తల్లిదండ్రులు తమ పిల్లలకు చుక్కలు వేయించడానికి నిరాకరించేలా చేస్తున్నాయి.

బలహీనమైన ప్రభుత్వ ఆరోగ్య సేవలు, టీకాలు నిల్వ చేయడానికి, పంపిణీ చేయడానికి సరైన సౌకర్యాలు లేకపోవడం కూడా ఒక ప్రధాన కారణమని తెలుస్తోంది.

## ప్రపంచవ్యాప్తంగా భారతీయ కాఫీకి పెరుగుతున్న ఆదరణ



మన్ కీ బాత్ కార్యక్రమంలో దేశ ప్రజలతో కాఫీ గురించి మాట్లాడాలని అనుకున్నానని ప్రధాని మోదీ తెలిపారు. గతేడాది తాను మన్ కీ బాత్ లో అరకు కాఫీ గురించి మాట్లాడడం గుర్తుండే ఉంటుందన్నారు. కొద్ది కాలం క్రితం ఒరిస్సాలోని ఎందరో ప్రజలు తనతో కోరాపుట్ కాఫీ గురించి తమ భావాలను పంచుకున్నారు. వారు తనకు రాసిన ఉత్తరంలో కోరాపుట్ కాఫీ గురించి మన్ కీ బాత్ లో మాట్లాడాల్సిందిగా కోరారని చెప్పారు. కోరాపుట్ కాఫీ రుచి అద్భుతంగా ఉంటుందని తనకు చెప్పారని మోదీ తెలిపారు. అలాగే రుచికి రుచిని అందించడంతో పాటూ, కాఫీ పంట కూడా ప్రజలకు లాభాన్ని అందిస్తోందన్నారు. కోరాపుట్ లో కొందరు కేవలం తమ అభిరుచి వల్లనే కాఫీ తోటలను సాగు చేస్తున్నారని మోదీ తెలిపారు. కార్పొరేట్ కంపెనీల్లో మంచి ఉద్యోగం చేస్తున్న వారు కూడా కాఫీని ఎంతగానో ప్రేమించడం వల్ల ఈ రంగంలోకి వచ్చేశారని చెప్పారు. ఇప్పుడు విజయవంతంగా ఈ పనిని చేస్తున్నారని చెప్పారు. కాఫీ వల్ల ఎందరో మహిళల జీవితాలలో సుఖవంతమైన మార్పు వచ్చిందని.. కాఫీ వల్ల వారికి గౌరవమూ, అభివృద్ధి రెండూ లభించాయని పేర్కొన్నారు. కోరాపుట్ కాఫీ నిజంగానే అత్యంత మనోహరమైనది.. ఇది ఒరిస్సాకే గర్వకారణం అని అర్థమని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా భారతీయ కాఫీ అత్యంత ప్రజాదరణను పొందుతోందన్నారు. కర్నాటకలోని చిక్మగళూరు, కూర్గ్, హాసన్ అయినా, తమిళనాడులోని పళని, శేవరాయ్, నీలగిరి, అన్నామలై ప్రాంతాలు, కర్నాటక- తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన బిలిగిరి ప్రాంతం, కేరళలోని వాయనాడ్, ట్రావన్కోర్, మలాబార్ ప్రాంతాలూ ఇవన్నీ భారతీయ కాఫీలోని భిన్నత్వాన్ని తెలుపుతాయని ప్రధాని మోదీ తెలిపారు. మన ఈశాన్య ప్రాంతాలు కాఫీ సాగులో ముందుకు నడుస్తున్నాయని చెప్పారు.దీనివల్ల భారతీయ కాఫీ గుర్తింపు ప్రపంచవ్యాప్తంగా మరింత బలోపేతం అవుతోందన్నారు. అందుకే భారతీయ కాఫీ అత్యున్నతమైనది. అది ఇక్కడ తయారవుతుంది.. ప్రపంచవ్యాప్తంగా ప్రేమించబడుతుంది. అని కాఫీ ప్రేమికులు అంటున్నారని మోదీ తెలిపారు.



## సంస్కృతి, ప్రకృతి, సమాజ ఐకమత్యం ఛట్ పండుగ: ప్రధాని మోదీ



ప్రతి నెలా చివరి ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలతో తన మనసులోని మాటను పంచుకునేందుకు 'మన్ కీ బాత్' కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దీపావళి, ఛట్ పూజ, జీఎస్టీ పొదుపు పండుగ, భారతీయ కాఫీ అత్యున్నతి, పరిశుభ్రత, మన సంస్కృతి, సంప్రదాయాలతో పాటు ప్రధాని మోదీ అనేక అంశాలను ప్రస్తావించారు. కొన్ని రోజుల క్రితమే దీపావళి పండుగను జరుపుకున్నామని మోదీ తెలిపారు. ఇప్పుడు ఛట్ పూజా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని అన్నారు. ఛట్ వ్రతాన్ని ఆచరించే మహిళలు ఆంకితభావంతో, నిష్ఠతో ఈ పండుగకు తయారవడం ఎంతో ప్రేరణాత్మకంగా ఉంటుందని చెప్పారు. సంస్కృతికి, ప్రకృతికి,



ఇంకా సమాజానికి మధ్య ఉన్న గాఢమైన ఏకత్వానికి ప్రతిబింబం ఈ ఛట్ పండుగ అని తెలిపారు.

ఛట్ పూజ జరుపుకునే నదీ తీరాలలో సమాజంలోని ప్రతి వర్గానికి చెందినవారూ కలిసి ఉంటారని ప్రధాని మోదీ కొనియాడారు. ఇది భారతదేశ సామాజిక ఐకమత్యానికి ఒక అందమైన ఉదాహరణ అని పేర్కొన్నారు.

## కార్తీకమాసం



కార్తీకమాసం తొలి సోమవారం కావడంతో రాష్ట్రంలోని పంచారామాలు, శ్రీశైలంతో పాటు ఇతర శైవక్షేత్రాలను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుంటున్నారు. వేకువజామునుంచే ఆలయాలకు భక్తులు బారులు తీరారు. భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించి, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. కృష్ణా, గోదావరి స్నాన ఘట్టాల్లో కార్తీకమాస స్నానాలు ఆచరించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.కార్తీక మాస మొదటి సోమవారం పురస్కరించుకుని శ్రీశైలంలో ఆలయ పుష్కరిణి వద్ద ఈ రోజు సాయంత్రం లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు

---

## సర్దార్ @150 పేరుతో యూనిటీమార్చ్ నిర్వహణ

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 31నుంచి వచ్చే నెల 25వ తేదీ వరకూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా యువజన అధికారి సుంకర రాము తెలిపారు. యువతలో ఐక్యత, దేశభక్తి భావాన్ని పెంపొందించే విధంగా జిల్లాలో సర్దార్ @150 పేరుతో యూనిటీమార్చ్ ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజయవాడలోని నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు



# 'ఎస్ఐఆర్'పై కేంద్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన




ఎస్ఐఆర్ -ప్రత్యేక సమగ్ర సవరణపై కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం కీలక ప్రకటన చేసింది. తొలి దశలో బీహార్లో ఎస్ఐఆర్ విజయవంతమైందని, మరో 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను చేపట్టనున్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు. రెండో దశ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను చేపట్టనున్నామని వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్లో పాల్గొన్న 7.5 కోట్ల మంది బిహార్ ప్రజలకు ధన్యవాదాలు అని తెలిపారు. తొలి దశ అనంతరం రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల ఎన్నికల అధికారులతో ఈసీ సమావేశాలు నిర్వహించి, సమగ్రంగా చర్చించామని వెల్లడించారు. అలాగే రెండోదశ జరగనున్న 12 రాష్ట్రాలు/యూటీల పేర్లను వెల్లడించారు. అండమాన్ నికోబార్, ఛత్తీస్గఢ్, గోవా, గుజరాత్, కేరళ, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, యూపీ, పశ్చిమబెంగాల్లో జరగనున్న రెండో దశలో 51 కోట్లమంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. నవంబర్ 4 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కానుందని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితాను డిసెంబర్ 9న ప్రకటిస్తామని, తుది జాబితాను ఫిబ్రవరి 7న విడుదల చేస్తామని చెప్పారు. పౌరసత్వానికి ఆధార్ ఒక ధ్రువీకరణ పత్రం కాదని, అయితే ఎస్ఐఆర్లో దానిని ఒక ఐడెంటిటీ ప్రూఫ్గా సమర్పించవచ్చని ఆయన చెప్పారు. అస్సాంలో ఓటర్ల జాబితా సవరణను విడిగా నిర్వహిస్తామని తెలిపారు. 1951 నుంచి 2004 వరకు ఎనిమిదిసార్లు ఎస్ఐఆర్ నిర్వహించారని అన్నారు. 21 ఏళ్ల కిందట ఓటర్ల జాబితా సవరణ జరిగిందని గుర్తు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా నకిలీ ఓట్లు, అక్రమ వలసదారులు, చనిపోయిన, బదిలీ చేయబడిన ఓటర్లను తొలగించినట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే SIR కార్యక్రమ లక్ష్యమని వెల్లడించారు. దేశ వ్యాప్తంగా ప్రతీ ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితాలో సవరణలు తప్పనిసరి అని స్పష్టం చేశారు. 'ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్కు కొందరు సహాయకులు ఉంటారు. జాబితా ప్రకటించాక ప్రతి ఒక్కరికీ అప్పీల్ చేసే అవకాశం ఉంటుంది. ప్రతి ఓటరుకు ఇన్యుమరేషన్ ఫామ్ అందుబాటులో ఉంటుంది. ప్రధానంగా 4 రకాల కారణాలతో ఓటర్ల తొలగింపు ఉంటుంది. అర్హులైన ఓటర్లే జాబితాలో ఉంటారు. అనర్హులను తొలగిస్తాం. 6 జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీ నేతలతో భేటీ ఏర్పాటు చేస్తాం. ఒక్కో అధికారి రోజుకు 50 ఇన్యుమరేషన్ ఫామ్లు పరిశీలిస్తారు. ఇన్యుమరేషన్ ఫామ్లు పరిశీలించాక ఓటరు జాబితా డ్రాఫ్ట్ ప్రకటిస్తాం. ఓట్లు తొలగించిన వారి పేర్లను స్థానిక కార్యాలయాల్లో ప్రదర్శిస్తాం.' అని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు.

## వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ గవర్నెన్స్ డివైస్‌లు

కర్నూలు బస్సు ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యం కారణమే అయినా.. అతివేగంగా వెళ్లడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. రోడ్డుపై పడి ఉన్న బైకును గమనించినా.. స్పీడ్ గా ఉన్నందున బ్రేక్ వేయలేకపోయానని స్వయంగా డ్రైవరే చెప్పాడు. సడన్ బ్రేక్ వేస్తే ప్రమాదానికి గురయ్యేంత వేగంతో బస్సు నడుపుతున్నట్లు ఒప్పుకున్నాడు. ఈ నేపథ్యంలో వాహనాల వేగంపై మరోసారి సర్వత్రా చర్చ జరుగుతోంది. వేగ నియంత్రణ కోసం తీసుకుంటున్న చర్యలను పలువురు ప్రశ్నిస్తున్నారు. కర్నూలు బస్సు ప్రమాదం తర్వాత బస్సుల ఫిట్ నెస్, నిబంధనల ఉల్లంఘించడం వంటి వాటిపై దృష్టి సారించిన అధికారులు.. వందలాది బస్సులపై కేసులు నమోదు చేస్తున్నారు. పదుల సంఖ్యలో బస్సులను సీజ్ చేస్తున్నారు. అయితే.. కేసు నమోదైన ఏ ఒక్క బస్సులో కూడా వేగ నియంత్రణ పరికరం లేదని పోలీసుల తనిఖీల్లో వెల్లడైంది. ముఖ్యంగా ప్రైవేటు బస్సులు పరిమితి దాటి వేగంతో ప్రయాణించడానికి కారణం.. వేగ నియంత్రణ పరికరాలు లేకపోవడమేనని తేలింది. ఫలితంగా రాత్రి వేళ, వర్షం కురుస్తున్న సమయంలో కూడా అతివేగంతో వాహనాలు నడుపుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రయాణికుల ప్రాణాలు గాలిలో దీపంలా మారుతన్నాయి. నిజానికి వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ గవర్నర్ డివైజ్లను ఉపయోగిస్తుంటారు. అయితే.. మన రాష్ట్రంలో వీటి వినియోగం లేదు. మహారాష్ట్ర, ఒడిశా వంటి కొన్ని రాష్ట్రాల్లో ప్రైవేట్ బస్సుల స్పీడ్కు కళ్లెం వేసేందుకు స్పీడ్ గవర్నర్ డివైజ్లను ఉపయోగిస్తున్నారు. మన దగ్గర కూడా బస్సులు తయారు చేసే కొన్ని సంస్థలు స్పీడ్ కంట్రోల్ డివైజ్లను అమర్చేవి. కొన్నేళ్ల పాటు ఇది కొనసాగినా తర్వాత వదిలేశారు. దీంతో రాష్ట్రంలో వాహన వేగంపై నియంత్రణ లేకుండా పోయింది. స్పీడ్ గవర్నెన్స్ డివైస్ అనేది ఒక వాహనం గరిష్ట వేగాన్ని పరిమితం చేయడానికి ఉపయోగించే ఒక పరికరం. చట్టప్రకారం దీనిని వాణిజ్య వాహనాలలో తప్పకుండా వినియోగించాలి. ఎందుకంటే ఇది వాహనం యొక్క భద్రతను, సమర్థతను మెరుగుపరుస్తుంది. ఈ పరికరాలు ఇంజిన్ వేగాన్ని నియంత్రిస్తాయి, తద్వారా డ్రైవర్ నిర్ణీత వేగాన్ని మించకుండా చూస్తాయి. ఇది ఇంజిన్ వేగాన్ని కొలిచి, ముందుగా నిర్ణయించిన పరిమితిని మించిపోతే.. పవర్ సరఫరాను, ఇంధన సరఫరాను తగ్గించి, వేగాన్ని నియంత్రిస్తుంది. అంతేకాదు.. వాహన మైలేజీని కూడా పెంచుతుంది. వాహనాలకు ఫిట్ నెస్ సర్టిఫికెట్ ఇవ్వాలన్నా, రెన్యువల్ చేయాలన్నా ఈ డివైస్ తప్పనిసరిగా ఉండాలి. తయారీదారు లేదా డీలర్ జారీ చేసిన స్పీడ్ గవర్నర్ సర్టిఫికేట్ను సమర్పించాలి. తెలంగాణలో బస్సులు ఎక్స్ప్రెస్ వేలపై గంటకు 100 కిలోమీటర్లు, నాలుగు లైన్ల జాతీయ రహదారులపై గంటకు 90 కిలో మీటర్లు, మున్సిపల్ పరిధిలోకి వచ్చే రోడ్లపై గంటకు 60 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించాలి. ట్రావెల్స్ డ్రైవర్లు ఎక్కడా నిర్దేశిత వేగానికి సంబంధించి నిబంధనలను పాటించడం లేదు. ఫలితం.. అతివేగం కారణంగా నిత్యం ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూ అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. నిబంధనల ప్రకారం.. బస్సు ఆపరేటర్లు తరచూ వాహనాల ఫిట్నెస్ను చెక్ చేయాలి. ప్రయాణికుల కోసం ఫైర్ సేఫ్టీ, ఎమర్జెన్సీ ఎగ్జిట్లు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలిపేలా సూచిక బోర్డులు పెట్టాలి. ప్రమాదాలు జరిగితే వాటిని బద్దలు కొట్టేందుకు సుత్తి అందుబాటులో ఉంచాలి. ఫస్ట్ ఎయిడ్ చేసే సదుపాయం ఉండాలి. ప్రమాదం జరిగే సమయంలో ప్రయాణికులను అప్రమత్తం చేసే ఎమర్జెన్సీ అలారం కూడా ఏర్పాటు చేసుకోవాలి. ఇవన్నీ ఉంటున్నా.. వేగాన్ని నియంత్రించే విషయంలో మాత్రం నిబంధనలను మీరుతున్నారు. ఇక ఓవర్ లోడ్తో బస్సులు నడపడం, 10-12 గంటలపాటు ఏకధాటిగా ఏసీ బస్సులను నడపడం వంటివి సర్వసాధారణంగా జరుగుతున్నాయి. ఫలితంగా కంప్రెషర్, కూలింగ్ ఫ్యాన్లు, ఆల్టర్నేటర్ వంటి భాగాలు ఒత్తిడికి గురై మంటలు చెలరేగుతున్నాయి. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రక్షణ కోసం చర్యలు తీసుకుంటున్నా.. ప్రైవేటు ట్రావెల్స్ మాత్రం యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయి. ప్రైవేటు సంస్థల యాజమాన్యాలు కూడా ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యతను బాధ్యతగా భావించినప్పుడే ఇటువంటి ప్రమాదాలు తగ్గుతాయి.

## ఆటోలో ప్రయాణించిన మాజీ మంత్రి హరీష్ రావు

హైదరాబాద్లోని ఎర్రగడ్డ నుంచి తెలంగాణ భవన్ వరకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ఆటోలో ప్రయాణించారు. ఎర్రగడ్డలో ఆటో డ్రైవర్లతో మాట్లాడి.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో ఆటో డ్రైవర్ల పరిస్థితి అధ్వాన్నంగా తయారైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పలువురు ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. ఆ కుటుంబాలన్నీ ఇప్పుడు రోడ్డుమీద పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన ఆటో కార్మికుల ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. అలాగే ఆటో కార్మికులంతా ధైర్యంగా, ఓర్పుగా ఉండాలని, ఎవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని కోరారు. తెలంగాణ భవన్ వరకు రమేష్ గౌడ్ అనే వ్యక్తి ఆటోలో వచ్చానని.. ఆటో నడుపుతూ తన కొడుకు స్కూల్ ఫీజు కట్టలేకపోతున్నానని, ఇంటి అద్దె, ఖర్చులు, ఆటో ఫైనాన్స్ అన్ని ఖర్చులు ఎక్కువైపోతున్నాయని అతను వాపోయాడని హరీష్ రావు తెలిపారు. రూ.5 వేల కోట్లు ఖర్చుపెట్టి రోడ్లు వేస్తున్న ప్రభుత్వానికి.. ఆటో డ్రైవర్లకు ఇచ్చేందుకు డబ్బులు లేవని అబద్ధాలు చెప్పడం దారుణమన్నారు. కాంగ్రెస్ సర్కారుకు వాటాల మీద ఉన్న శ్రద్ధ ఆటో డ్రైవర్లపై లేదని హరీష్ రావు విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆటో కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని చెప్పి రాహుల్ గాంధీ మాట తప్పారని, ఆటో కార్మికులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1500 కోట్లు బాకీ పడిందన్నారు. పక్క రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన ఏడాదికే ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఇచ్చారని.. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా ఇంకా హామీ ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడం పట్ల చంద్రబాబు నాయుడికి ఉన్న చిత్తశుద్ధి రేవంత్ రెడ్డికి లేదని విమర్శించారు. ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని, వారికి ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

---

## జిల్లాలో జాతీయ యువజన క్రీడల శాఖ, మై భారత్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మీట్

జగిత్యాల జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్.... జాతీయ యువజన క్రీడల శాఖ మరియు మై భారత్ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లాలో స్వామి వివేకానంద మినీ స్టేడియంలో జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. 22 మరియు 23 తేదీలలో యువతి, యువకులకు వేరువేరుగా వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, షార్ట్ పూట్, బ్యాడ్మింటన్, చెస్ నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. జగిత్యాల జిల్లా మై భారత్ జిల్లా వాలంటీర్ గణేష్ దూరదర్శన్ తో మాట్లాడుతూ జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. మహిళలకు, పురుషులకు వేరువేరుగా వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, షార్ట్ పూట్, బ్యాడ్మింటన్, చెస్ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. యువతను చెడు అలవాట్లకు దూరంగా ఉంచాలని, స్పోర్ట్స్ పట్ల ఆకర్షించాలానే ఉద్దేశంతో మై భారత్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. బ్లాక్ లెవెల్ లో గెలుపొందిన వారికి గత రెండు రోజులుగా జిల్లాస్థాయి పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులను అందజేశామన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను క్రీడల పట్ల ప్రోత్సహించాలని కోరారు. గెలుపొందిన క్రీడాకారులు (రమేష్, హారిక) మాట్లాడుతూ జిల్లాస్థాయిలో గెలుపొందడం సంతోషంగా ఉందని ఇదే స్ఫూర్తితో రాష్ట్ర జాతీయ స్థాయిలో జరిగే క్రీడల్లో పాల్గొంటామని తెలిపారు ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. మై భారత్ ఆధ్వర్యంలో మరిన్ని క్రీడా పోటీలు నిర్వహించాలని ఆకాంక్షించారు.

## జీఎస్టీ పొదుపుతో పండుగల్లో స్వదేశీ వస్తువుల కొనుగోలు: ప్రధాని మోదీ




ఆపరేషన్ సిందూర్ ప్రతి భారతీయుడి మనసునీ గర్వంతో నింపేసిందని మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. పండుగల సందర్భంగా దేశం సాధించిన విజయాలను ఉత్తరంలో పంచుకున్నానని.. దానికి జవాబుగా తనకు దేశంలోని అనేక మంది ప్రజలు తమ సందేశాలను పంపించారని గుర్తు చేశారు. ఒకప్పుడు మావోయిస్టుల భీభత్సంతో చీకటి నిండిన ప్రాంతాలలో ఈసారి ఆనందాల దీపాలను వెలిగించారని అభివర్ణించారు. తమ పిల్లల భవిష్యత్తుని ఆపదలో పడేసిన ఆ మావోయిస్టు భయం మూలాల నుండి నాశనం అవ్వాలని ప్రజలు కోరుకుంటున్నారని మోదీ తెలిపారు. మరోవైపు జీఎస్టీ పొదుపు పండుగ వల్ల దేశ ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని మోదీ తెలిపారు. అలాగే ఈసారి స్వదేశీ వస్తువుల కొనుగోళ్ళు చాలా ఎక్కువగా జరిగాయని చెప్పారు. ప్రజలు తనకు పంపించిన సందేశాలలో వారి ఈసారి ఏమేమి స్వదేశీ వస్తువులను కొన్నారో రాశారని తెలిపారు. తాను లేఖలో వంటనూనె వాడకాన్ని పది శాతం తగ్గించమని కోరానని.. దీనికి కూడా ప్రజలు చాలా సానుకూలంగా స్పందించారని మోదీ తెలిపారు.

## యువ కంటెంట్ క్రియేటర్లతో సంస్కృతానికి కొత్త ఊపిరి: ప్రధాని మోదీ



సంస్కృతం పేరు వింటూనే మన మనసులో మన ధర్మ గ్రంధాలు, వేదాలు,ఉపనిషత్తులు,పురాణాలు, శాస్త్రాలు, ప్రాచీన జ్ఞాన విజ్ఞానం, ఆధ్యాత్మికత, సందర్శన గుర్తుకు వస్తాయని ప్రధాని మోదీ తెలిపారు. ఒకానొక కాలంలో వీటన్నింటితో పాటూ సంస్కృతం ఒక వాడుక భాషగా కూడా ఉండేదన్నారు. ఆ యుగంలో అధ్యాయనం ,శోధన సంస్కృతంలోనే జరిగేవని తెలిపారు. నాటక ప్రదర్శన కూడా సంస్కృతంలోనే ఉండేదన్నారు. కానీ, దురదృష్టం కొద్దీ బానిసత్వపు కాలంలోనూ, స్వాతంత్రం వచ్చిన తరువాత కూడా సంస్కృతం చాలా నిర్లక్ష్యానికి గురైందని మోదీ అన్నారు. ఈ కారణంగా యువతలో సంస్కృతం పట్ల ఆకర్షణ తగ్గుతూ వచ్చిందన్నారు. కానీ, ఇప్పుడు సంస్కృతానికి

కూడా కాలం మారుతోందన్నారు. సంస్కృతి, సోషల్ మీడియా ప్రపంచం కలిసి సంస్కృతానికి కొత్త ఊపిరిని అందించాయని పేర్కొన్నారు. ఈ రోజుల్లో ఎందరో యువత సంస్కృతం తాలుకు ఎన్నో ఆసక్తికరమైన పనులు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. సోషల్ మీడియాలోకి వెళ్తే ఎన్నో రీల్స్ కనిపిస్తాయి. వాటిల్లో ఎందరో కొంతమంది యువత సంస్కృతం గురించి మాట్లాడుతూ కనిపిస్తారని చెప్పారు. ఎందరో వ్యక్తులు తమ సోషల్ మీడియా ఛానళ్ల ద్వారా సంస్కృతాన్ని నేర్పిస్తున్నారని చెప్పారు. ఇలాంటి ఒక యువ కంటెంట్ క్రియేటర్, సోదరుడు యశ్ సాలుండ్కే.



యశ్ కంటెంట్ క్రియేటరు, క్రికెట్ క్రీడాకారుడు. సంస్కృతంలో మాట్లాడుతూ క్రికెట్ ఆడుతూ ఆయన చేసిన రీల్ ని చాలామంది ఎంతగానో ఇష్టపడ్డారని తెలిపారు. అలాగే కమల, జాహ్నవి అనే ఇద్దరు అక్కాచెల్లెళ్ళు గొప్ప పని చేస్తున్నారని మోదీ కొనియాడారు. వీరిద్దరూ ఆధ్యాత్మికత, దర్శనం, సంగీతాలపై కంటెంట్ చేస్తారని చెప్పారు. ఇన్స్టాగ్రామ్లో సంస్కృత్ ఛాత్రోహమ్ అనే మరొక యువకుడి ఛానల్ ఉందన్నారు. ఈ ఛానల్ను నడిపే యువ మిత్రులు సంస్కృతంతో ముడిపడిన సమాచారాన్ని ఇవ్వడమే కాకుండా వాళ్ళూ సంస్కృతంలో కామెడీ వీడియోలు కూడా తయారుచేస్తారని చెప్పారు. సంస్కృతంలో ఉన్న ఈ వీడియోలను యువత ఎంతో ఇష్టపడతారు. సమష్టి వీడియోలను చాలా మంది చూసే ఉంటారని.. ఆమె సంస్కృతంలో తన గీతాలను రకరకాలుగా వినిపిస్తుందన్నారు. మరొక యువకుడు భావేశ్ భీమనాథనీ. భావేశ్ సంస్కృత శ్లోకాలను, ఆధ్యాత్మిక దర్శనాలు, సిద్ధాంతాల గురించి మాట్లాడతారని చప్పారు. ఏదైనా ఒక సమాజానికి చెందిన విలువలకు, వారసత్వానికి భాష వారధి లాంటిదన్నారు. సంస్కృతం ఈ కర్తవ్యాన్ని వేల ఏళ్ల వరకూ నిర్వర్తించిందన్నారు. ఇప్పుడు సంస్కృతం కోసం కొందరు యువత తమ కర్తవ్యాన్ని నిర్వర్తించడాన్ని చూడడం చాలా ఆనందదాయకంగా ఉందన్నారు.

## ఆదివాసీ గౌరవ దినోత్సవం.. భగవాన్ బిర్సా ముండాకు నివాళులు

రాబోయే నెలలో 15వ తేదీన ఆదివాసీ గౌరవ దినోత్సవాన్ని జరుపుకుంటామని ప్రధాని నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. ఆరోజు భగవాన్ బిర్సా ముండా జయంతి. తాను భగవాన్ బిర్సా ముండాకు నమస్కరిస్తున్నానని అన్నారు. దేశ స్వాతంత్ర్యానికి, ఆదివాసీ సముదాయాల అధికారాలకు గానూ, ఆయన చేసిన పని వెలకట్టలేనిదని కొనియాడారు. ఝార్ఖండ్లోని బిర్సా ముండా గ్రామం ఉలిహాతు వెళ్ళే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. తాను అక్కడి మట్టిని నుదుటికి తాకించుకుని నమస్కరించానని చెప్పారు.



భగవాన్ బిర్సా ముండా, కొమరం భీమ్ లాగే ఆదివాసీ సముదాయాలలో ఎందరో గొప్ప వ్యక్తులు ఉన్నారని తెలిపారు. మీరు వారందరి గురించి తప్పకుండా తెలుసుకోవాలని కోరుతున్నానని ప్రధాని మోదీ తెలిపారు.

# డిజిటల్ అరెస్టు మోసాలపై స్పందించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజల నుంచి భారీ మొత్తంలో డబ్బును కాజేస్తుండడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి భవన్లో ప్రొబేషనరీ ఐపీఎస్లను ఉద్దేశించి ద్రౌపదీ ముర్ము ప్రసంగించారు. డిజిటల్ అరెస్టును ప్రజలకు ఉన్న అత్యంత భయంకరమైన ప్రమాదాల్లో ఒకటి అని పేర్కొన్నారు. ఇలాంటి వాటిని ఎదుర్కోవాలంటే సైబర్ నేరాలపై ప్రజలకు పోలీసులు సరైన అవగాహన కల్పించాలని సూచించారు. పోలీసుల పట్ల ప్రజలకు భయం ఉండకూడదని, వారు తమకు రక్షణగా నిలుస్తారనే గౌరవం ఉండాలని అన్నారు. సైబర్ నేరగాళ్లు వీడియో కాల్స్ చేసి.. తాము పోలీసులమని బెదిరిస్తారని.. తాము చెప్పినట్లు చేయకపోతే డిజిటల్ అరెస్టు చేస్తామని భయపెడతారని ద్రౌపదీ ముర్ము అన్నారు. ఇలాంటి సమయాల్లో ప్రజలు చాకచక్యంగా వ్యవహరించి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ డిజిటల్ అరెస్టు ప్రభావం పోలీసు వ్యవస్థపైనా అధికంగా ఉంటుందన్నారు. సైబర్ నేరగాళ్లు పోలీసుల మాదిరి ప్రజలను నమ్మించి మోసం చేయడంతో.. అసలైన పోలీసులు ఎవరనే విషయాన్ని కూడా వారు గ్రహించలేకపోతారని అన్నారు.



మరోవైపు డిజిటల్ అరెస్ట్ మోసాలపై సుప్రీంకోర్టు స్పందించింది. పోలీసులు, న్యాయాధికారులమని నకిలీ కోర్టు పత్రాలతో పౌరులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న మోసాలపై దాఖలైన కేసును సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఈ క్రమంలోనే జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. ఈ తరహా మోసాలకు సంబంధించి తమ పరిధిలో నమోదైన ప్రథమ సమాచార నివేదికల (ఎఫ్ఐఆర్) వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. దేశవ్యాప్తంగా ఒకేరీతిలో దర్యాప్తు జరిగేలా చూసేందుకు రాష్ట్రాలకు నోటీసులు జారీ చేస్తున్నాం అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ 'డిజిటల్ అరెస్ట్' మోసాలు కేవలం దేశవ్యాప్తంగానే కాకుండా, దేశ సరిహద్దులు దాటి కూడా జరుగుతున్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ క్రమంలోనే ఈ కేసు దర్యాప్తునకు ప్రణాళికతో రావాలని సీబీఐని ఆదేశించింది.

## శిశువు విక్రయ ఘటనపై మంత్రి సీతక్క ఆగ్రహం.. అధికారులకు కీలక ఆదేశాలు




నల్గొండ జిల్లాలో శిశువు విక్రయ ఘటనపై మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై వెంటనే పూర్తి నివేదిక సమర్పించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితారామచంద్రన్,డైరెక్టర్ శృతి ఓజాను ఆదేశించారు. పిల్లల అమ్మకాలపై, అక్రమ దత్తతపై ప్రత్యేక డ్రైవ్ లు నిర్వహిస్తున్నా.. ఇలాంటి ఘటనలు ఎందుకు చోటు చేసుకుంటున్నాయని సీతక్క ప్రశ్నించారు. విక్రయానికి పెట్టిన శిశువును వెంటనే సంరక్షణలోకి తీసుకుని తల్లిదండ్రుల పరిస్థితిని తెలుసుకోవాలని.. ఈ ఘటనలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యం ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తల్లీబిడ్డల సంరక్షణకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని అన్నారు. పేదరికం, అజ్ఞానం లాంటి కారణాలతో ఇలాంటి దారుణాలు జరగడం మనసుకు ఎంతగానో బాధ కలిగిస్తుందని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ, బాలల సంరక్షణ కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సమాజం కూడా ఇలాంటి అన్యాయాలను నిరోధించడానికి ముందుకు రావాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

---

## తెలంగాణలో ముగిసిన మద్యం షాపుల డ్రా ప్రక్రియ

తెలంగాణలో మద్యం షాపుల డ్రా ప్రక్రియ ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 2,620 షాపులకు సోమవారం అధికారులు, కలెక్టర్ల సమక్షంలో ఎక్సైజ్ శాఖ అధికారులు డ్రా తీశారు. హైదరాబాద్, సికింద్రాబాద్లో 179 మద్యం షాపులకు డ్రా ముగిసింది. డిసెంబర్ 1వ తేదీ నుంచి తెలంగాణవ్యాప్తంగా కొత్త వైన్స్ షాపుల నిర్వహణ కొనసాగనుంది. కాగా, స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉండటంతో మద్యం షాపులు దక్కించుకునేందుకు కొందరు సిండికేట్ అయి టెండర్లు వేశారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారంపై విపక్షాలు నెగిటివ్ ప్రచారం చేస్తుండటంతో యువకులు, వ్యాపారులు మద్యం వ్యాపారంపై పలువురు కన్నేశారు. పలుచోట్ల గ్రూపుగా ఏర్పడి ఎక్కువగా దరఖాస్తులు వేశారు. గ్రూపుగా కావడంతో పాటు ఫీజు పెంపు కారణంగా దరఖాస్తులు తగ్గినట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఒక్కో దరఖాస్తుకు ప్రభుత్వం రూ.3లక్షలు ఫీజు పెట్టింది. ఎంపికైన దరఖాస్తు దారులు అదే రోజు గానీ, మరుసటి రోజు గానీ షాప్ ఎక్సైజ్ పన్ను మొదటి వాయిదాను చెల్లించి షాపు కేటాయింపు నిర్ధారణ లేఖ తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులు సూచిస్తున్నారు.


## అంతర్జాతీయ యానిమేషన్ దినోత్సవం




చిన్ననాటి ఊహల్ని చిత్రాలుగా మలచిన అద్భుత ప్రపంచం. జీవం లేని చిత్రాలకు ప్రాణం పోసిన సృజనాత్మక కళ. అమ్మ జోలపాట స్థానాన్ని భర్తీ చేసింది. అమ్మమ్మ, తాతయ్య చెప్పే చిట్టి కథల ప్లేసునూ ఆక్రమించింది. టీవీల్లోకి చొరబడింది.. మొబైల్ ఫోన్లలోకి చొచ్చుకొచ్చింది. ఒక్కటేంటి... ఇందుగలదందు లేదన్నట్లుగా నాలుగంగుళాల ఫోన్ స్క్రీన్ మొదలుకొని.. మల్టీప్లెక్స్ లోని బిగ్ స్క్రీన్ వరకు అన్నింటినీ ఏలేస్తోంది యానిమేషన్ టెక్నాలజీ. ఇవాళ అంతర్జాతీయ యానిమేషన్ దినోత్సవం. యానిమేషన్లో వచ్చిన కొత్త కొత్త టెక్నాలజీలను ఉపయోగిస్తూ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాలు.. ఏఐ రాకతో వినోద ప్రపంచాన్ని సమూలంగా మార్చబోతున్నాయి. 1926లో ఫ్రెంచ్ ఆర్టిస్ట్ ఎమిల్ రేనో రూపొందించిన తొలి యానిమేటెడ్ ఫిల్మ్ "Pauvre Pierrot" ప్రదర్శన జరిగింది. దీనినే చలన చిత్ర చరిత్రలో యానిమేషన్ పుట్టుకగా పరిగణిస్తారు. మొదట్లో దీనిని గుర్తించకపోయినప్పటికీ.. యానిమేషన్ కు పెరుగుతున్న ఆదరణతో 2002లో ఇంటర్నేషనల్ యానిమేటెడ్ ఫిల్మ్ అసోసియేషన్.. AS-IFA .. Pauvre Pierrot యానిమేషన్ మూవీ విడుదలైన అక్టోబర్ 28వ తేదీని అంతర్జాతీయ యానిమేషన్ డేగా గుర్తించింది. తొలుత కార్టూన్లతో మొదలైనప్పటికీ.. అక్కడితో ఆగిపోలేదు ఈ యానిమేషన్ కళ. ఆలోచనలకు రూపమివ్వగల శక్తిని సంతరించుకుంది. నిజానికి ఒక చిత్రం కదలడానికి ఒక్క సెకనుకు 24 ఫ్రేములు అవసరం. కానీ, ఆ 24 ఫ్రేముల వెనుక వందల గంటల సృజన, కృషి దాగి ఉంటుంది. మొదట మాన్యువల్ డ్రాయింగ్స్తో ప్రారంభమైన ఈ కళ... ఇప్పుడు కంప్యూటర్ జనరేటెడ్ ఇమేజరీ.. అంటే CGI యుగంలోకి అడుగుపెట్టింది. 2D, 3D,

మోషన్ గ్రాఫిక్స్, స్టాప్ మోషన్.. ఇప్పుడు ఏఐ వంటి ఎన్నో సాంకేతిక రూపాల్లో విస్తరించింది. వాల్ట్ డిస్నీ సృష్టించిన మిక్కీ మౌస్ నుండి పిక్సార్, డ్రీమ్వర్క్స్ లాంటి స్టూడియోలు చేసిన టాయ్ స్టోరీ, ఫైండింగ్ నెమో, కుంగ్ ఫు పాండా, ఫ్రోజెన్ వరకు వినోదంతోపాటు భావోద్వేగాలకు కూడా వేదికైంది ఈ యానిమేషన్. భారతదేశంలో కూడా యానిమేషన్ రంగం వేగంగా ఎదుగుతోంది. 1956లో 'ది బన్యన్ డీర్' అనే తొలి భారతీయ యానిమేటెడ్ చిత్రాన్ని Films Division సంస్థ రూపొందించింది. ఆ తర్వాత పిల్లలందరికీ సుపరిచితమైన శక్తిమాన్ యానిమేటెడ్ సిరీస్, చోటా భీమ్, మొటు పత్లూ లాంటివెన్నో ఈ రంగాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లాయి. హైదరాబాద్, ముంబయి, బెంగళూరు లాంటి నగరాలు యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, గ్రాఫిక్స్కు గ్లోబల్ హబ్లుగా మారాయి. తెలంగాణలోని టీ-హబ్, ఇమేజ్ టవర్ వంటి భారతీయ యానిమేషన్ పరిశ్రమకు చిరునామాగా మారుతున్నాయి. యానిమేషన్ కేవలం పిల్లల వినోదానికి మాత్రమే పరిమితం కాలేదు. ప్రచారం, విద్య, వైద్యం, రక్షణ, శిక్షణ, గేమింగ్.. ఇలా ప్రతి రంగంలోనూ యానిమేషన్ కీలక పాత్ర పోషిస్తోంది. AI, వర్చువల్ రియాలిటీతో కలిసిన కొత్త యుగం .. ఇమర్సివ్ యానిమేషన్ యుగం మొదలవుతోంది. భవిష్యత్తులో యానిమేషన్ ప్రపంచం వాస్తవాన్ని మించే అనుభూతి అందించబోతోంది. ఒక ఆలోచనను జీవంతో చూపించే సత్తా కలిగిన ఈ కళ.. కథ చెప్పడంలో, భావాలను వ్యక్తపరచడంలో, ఊహలకు రెక్కలు ఇవ్వడంలో యానిమేషన్ ఎల్లప్పుడూ అగ్రగామిగా నిలుస్తుంది. అందుకే సృజనాత్మకతతో మన ఊహలకు రూపమిచ్చే కళాకారులందరినీ గౌరవిద్దాం.

## భద్రాచలంలోని గోదావరిలో నది హారతి కార్యక్రమం



దక్షిణ అయోధ్యగా బాసిల్లుతున్న ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కొలువైన భద్రాచలం లోని పావన గోదావరిలో సాయం సంధ్య వేళ కార్తీకమాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని నదిహారతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.. తెల్లవారుజాము నుండి రామాలయ అనుబంధ శివాలయం మరియు వివిధ శివాలయాలలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.. కార్తిక మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని ఆలయాలలో సాయంసంధ్య వేళ ఏర్పాటుచేసిన కార్తీకదీపం లో భక్తులు పాల్గొని కార్తీకదీపాలు వెలిగించారు... ఆలయ ప్రాంగణంలో చిన్నారుల భక్తి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.. ఈ సందర్భంగా శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి శ్రావణ్ కుమార్ దూరదర్శన్ తో మాట్లాడుతూ.. ప్రముఖ శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అనుబం ఆలయం శ్రీ అన్నపూర్ణ సమేత కాశి విశ్వేశ్వర స్వామి వారి సన్నిధిలో కార్తీక్ సోమవారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించామని అదేవిధంగా పవిత్ర గోదావరి తీరంలో నదిహారతి కార్యక్రమాన్ని ఆలయాలలో సంధ్య హారతి కార్యక్రమాన్ని కార్తీక దీపోత్సవాన్ని ఏర్పాటు చేశామని తెలియజేశారు.

## విధుశేఖర భారతీ స్వామితో  సీఎం రేవంత్ రెడ్డి భేటీ





హైదరాబాద్‌లోని నల్లకుంటలో ఉన్న శంకర్‌మఠ్‌కు తెలంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెళ్లారు. ఈ సందర్భంగా గణపతి, శారదాంబ, చంద్రమౌళీశ్వర స్వామి, ఆదిశంకరాచార్యుల ఆలయాలను రేవంత్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మంత్రి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కూడా ఉన్నారు. 'ధర్మ విజయ యాత్ర'లో భాగంగా శృంగేరి జగద్గురువులు విధుశేఖర భారతీ స్వామి నగరంలోని శంకర్‌మఠ్‌కు వచ్చారు. విషయం తెలుసుకున్న సీఎం రేవంత్ రెడ్డి నేరుగా శంకర్‌మఠ్‌కు వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకుని దివ్య ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా వేములవాడ ఆలయ అభివృద్ధి వివరాలను విధుశేఖర భారతీ స్వామి వారికి రేవంత్ రెడ్డి వివరించారు.

---

## నేడు పదాతిదళ దినోత్సవం.. భారత సైన్యంలో అతిపెద్ద పోరాట విభాగం పదాతిదళం



ఒక దేశాన్ని పరిరక్షించడం కోసం సైనికులు ప్రాణ త్యాగానికైనా వెనుకాడరు. దేశ సరిహద్దు వద్ద కాపలా ఉంటూ చొరబాటుదారులను అడ్డుకోవడమే కాదు.. యుద్ధంలో ముందుండి పోరాడుతారు. దేశాన్ని త్రివిధ దళాలు నిరంతరం గస్తీ కాస్తూ...కంటిరెప్పలా కాపాడుతుంటాయి. అయితే భారత సైన్యంలో అతిపెద్ద పోరాట విభాగం పదాతిదళం. 1947లో అక్టోబర్ 27న జమ్ముకశ్మీర్ నుంచి చొరబాటుదారులకు తరిమికొట్టింది. పదాతి దళం నిర్వహించిన ఆపరేషన్ కు గుర్తుగా ప్రతి ఏటా అక్టోబరు 27న పదాతిదళ దినోత్సవాన్ని జరుపుకుంటారు. పాకిస్థాన్ ముష్కరులు, ఆ దేశ సైనికులతో కలిసి కశ్మీర్లోని మొహూరా విద్యుత్ కేంద్రంపై దాడి చేశారు. దాంతో జమ్మూకశ్మీర్ చివరి పాలకుడు మహారాజా హరిసింగ్ భారత ప్రభుత్వ సాయం కోరారు. కేంద్ర ప్రభుత్వం






వెంటనే సైన్యంలోని సిక్ రెజిమెంట్ మొదటి బెటాలియన్ ను శ్రీనగర్ పంపింది. అక్టోబరు 27న శ్రీనగర్ చేరుకున్న సిక్ రెజిమెంట్....పాక్ చొరబాటుదారులను తరిమి కొట్టింది. ఆ విజయాన్ని పురష్కరించుకొని 1947 అక్టోబర్ 27న పదాతి దళం శ్రీనగర్ చేరిన రోజుని ప్రతి ఏటా శౌర్య దినోత్సవంగా నిర్వహిస్తారు. పదాతి దళం ఇలాంటి ఎన్నో ఆపరేషన్లను చేపట్టింది. పదాతి దళం భారత సైన్యంలో మొదటి పోరాట దళం. భారత సైన్యంలోని పదాతిదళాన్ని క్వీన్ ఆఫ్ బ్యాటిల్ గా వ్యవహరిస్తారు. దేశానికి సేవ చేస్తూ తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరులను గౌరవించి, హృదయపూర్వక నివాళి అర్పించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం. అంతేకాదు, భారత సైనికుల త్యాగాలు, సేవల గురించి దేశ ప్రజలకు అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యాలలో ఒకటి. 79వ పదాతి దళ దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పదాతిదళ దినోత్సవంలో భాగంగా దేశ సేవలో అమరులైన వీర సైనికులకు ఉన్నతాధికారులు న్యూఢిల్లీలోని నేషనల్ వార్ మెమోరియల్ వద్ద పుష్పాంజలి ఘటించారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్లు అందజేస్తాం: ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ ఇళ్లను ఇస్తామని మహబూబ్నగర్ శాసనసభ్యుడు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు... మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలో 180 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇంకా నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు.. అందుకు అవసరమైన తొమ్మిది కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.. అవినీతి రాజకీయాలకు తావులేకుండా నిజమైన లబ్ధిదాలను ఎంపిక చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.. అదేవిధంగా తమ ప్రభుత్వం ఇల్లు లేని ప్రతి నిరుపేదకు సొంత ఇంటి కల నెరవేర్చేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు.

---

## ప్లాస్టిక్ను తొలగించేందుకు అంబికాపూర్లో గార్బేజ్ కేఫ్ ఏర్పాటు: ప్రధాని మోదీ




పరిశుభ్రత కోసం చేస్తున్న ప్రయత్నాలగురించి ప్రధానినరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రస్తావించారు. ఛత్తీస్గఢ్కు చెందిన అంబికాపూర్లో నగరం నుండి ప్లాస్టిక్ను తొలగించడానికి ఒక వినూత్న ప్రయత్నం జరిగిందని చెప్పారు. అంబికాపూర్లో గార్బేజ్ కేఫ్ను నడుపుతున్నారని తెలిపారు. ఈ కేఫ్ కు ప్లాస్టిక్ ను తీసుకెళ్తే కడుపునిండా భోజనాన్ని పెడతారని మోదీ కొనియాడారు. ఎవరైనా అక్కడికి ఒక కేజీ ప్లాస్టిక్ ను తీసుకువెళ్తే మధ్యాహ్నం భోజనం లేదా రాత్రి భోజనం లభిస్తుందన్నారు. అర కేజీ ప్లాస్టిక్ ను తీసుకువెళ్తే టిఫిన్ అందిస్తారని చెప్పారు. ఈ కేఫ్ ను అంబికాపూర్ నగరపాలక సంస్థ నడిపిస్తుందని ప్రధాని మోదీ వెల్లడించారు. ఇలాంటి విన్నూత చర్యనే బెంగుళూరులో కపిల్ శర్మ అనే ఇంజనీరు చేపట్టారని మోదీ స్పష్టం చేశారు. బెంగుళూరును సరస్సుల నగరం అని కూడా అంటారని గుర్తు చేశారు. కపిల్ శర్మ ఇక్కడి సరస్సులకు కొత్త జీవితాన్ని ఇచ్చే ప్రచారాన్ని ప్రారంభించారు. కపిల్ శర్మ జట్టు బెంగుళూరు, ఆ చుట్టుపక్కల ప్రాంతాలలోని నలభై బావులకు, ఆరు సరస్సులకు తిరిగి ప్రాణం పోశారని కొనియాడారు. ఆయన తన మిషన్లో కార్పొరేట్లను, స్థానిక ప్రజలను కూడా భాగస్వామ్యులను చేసుకున్నారని తెలిపారు. ఏదైనా చేయాలని నిర్ణయం తీసుకుంటే మార్పు తప్పకుండా వచ్చి తీరుతుందని అనేందుకు అంబికాపూర్ నగరపాలక సంస్థ, బెంగుళూరుకు చెందిన కపిల్ శర్మ నిరూపించారని ప్రధాని మోదీ కొనియాడారు.

## రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము భారత వైమానిక దళ న రఫేల్ యుద్ధవిమానంలో

త్రివిధ దళాధిపతి  రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ రోజు భారత వైమానిక దళానికి చెందిన రఫేల్ యుద్ధవిమానంలో గగనవిహారం చేశారు. హరియాణాలోని అంబాలా  వైమానిక స్థావరం నుంచి ఈ  ఉదయం ఆమె రఫేల్ యుద్ధ విమానంలో పయనించారు. ఈ యుద్ధ విమానాన్ని ఈ ఏడాది మేలో చేపట్టిన ఆపరేషన్ సిందూర్లో ఉపయోగించారు. రఫేల్ యుద్ధవిమానాల సాయంతోనే పాకిస్థాన్లోని ఉగ్ర శిబిరాలను భారత సైన్యం ధ్వంసం చేసింది. ప్రస్తుతం ఈ యుద్ధ విమానంలోనే రాష్ట్రపతి పయనించి సరికొత్త రికార్డును నెలకొల్పారు. శక్తివంతమైన రఫెల్ విమానంలో ప్రయాణించటం మరపురాని అనుభాన్ని కలిగించిదని ......ఈ ప్రయాణాన్ని  విజయవంతంగా నిర్వహించినందుకు భారత వైమానిక దళం, అంబాలా వైమానిక దళ స్థావర  బృందాన్ని  అభినందిస్తున్నట్లు రాష్ట్రపతి సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు.



## భారత్ లో  తొలిసారిగా ప్రయాణికుల విమానాల తయారీ

దేశంలోనే తొలిసారిగా పూర్తిస్థాయి ప్రయాణికుల విమానాల తయారీకి భారత వైమానిక రంగం సిద్ధమైంది. రష్యాకు చెందిన ప్రముఖ సంస్థ యునైటెడ్ ఎయిర్క్రాఫ్ట్ కార్పొరేషన్ (యూఏసీ) సహకారంతో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును చేపట్టనుంది. దీనికి సంబంధించి ఇరు సంస్థల మధ్య కీలక ఒప్పందం కుదిరనట్లు రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశారు. ఈ ఒప్పందం దేశ పౌర విమానయాన రంగానికి మైలురాయిగా ప్రశంసించారు. ఉడాన్ పథకం కింద కనెక్టివిటీకి ఎస్జే-100 గేమ్ ఛేంజర్ అవుతుందని, పౌర విమానయానంలో ఆత్మనిర్భరత సాధించడంలో ఇది ఒక పెద్ద ముందడుగు అని అన్నారు. దేశంలో తయారు చేయబడిన మొట్టమొదటి పూర్తి ప్రయాణీకుల విమానం ఎస్జే-100 అవుతుందని పేర్కొన్నారు. ఈ విమానాల తయారీ ప్రైవేట్ రంగాన్ని బలోపేతం చేస్తుందని, విమానయాన పరిశ్రమలో ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలను సృష్టిస్తుందని రాజ్నాథ్ సింగ్ వెల్లడించారు.  దేశంలో పూర్తిస్థాయిలో ప్రయాణికుల విమానం తయారు చేయనుండటం ఇదే ప్రథమం. 1961లో ఇండియాలో హెచ్ఎస్-748 విమానాలను తయారు చేశారు. ఆ ప్రాజెక్ట్ సుమారు 27 సంవత్సరాల కన్నా ఎక్కువ కొనసాగింది. 1988లో ప్రాజెక్ట్ ముగిసింది. దాని తర్వాత మళ్లీ ఈ తరహా ప్రాజెక్ట్ చేపట్టడం ఇదే ప్రథమం. రానున్న పదేళ్లలో స్థానిక కనెక్టివిటీ పెంచడం కోసం చిన్న పరిమాణ కలిగిన ఎస్జే-100 వంటి విమానాలు 200 వరకు అవసరం అవుతాయి. వీటితో పాటుగా హిందూ మహాసముద్ర ప్రాంతంలో పర్యాటకాన్ని పెంచడానికి, సమీపంలోని అంతర్జాతీయ పర్యాటక ప్రదేశాలకు సేవ చేయడానికి అదనంగా 350

విమానాలను అందుబాటులోకి తీసుకురాబోతున్నారు. పౌర విమానయాన రంగంలో భారత్ ఆత్మనిర్భరత సాధించేందుకు ఈ ఒప్పందం కీలకంగా మారుతుందని హెచ్ఏఎల్ ఒక ప్రకటనలో తెలిపింది. ఎస్జే-100 విమానం రెండు ఇంజిన్లను కలిగి ఉంటుంది. కానీ దీని పరిమాణం చాలా చిన్నది. ఇందులో కేవలం 103 మంది ప్రయాణికులు మాత్రమే ప్రయాణం చేయగలరు. తక్కువ దూరం ప్యాసింజర్ సేవలకు ఇవి అనుకూలంగా ఉంటాయి. వీటి నిర్వహణ ఖర్చు కూడా చాలా తక్కువే. తాజాగా హెచ్ఏఎల్, రష్యా మధ్య కుదిరిన ఒప్పందం కారణంగా.. దేశీయ అవసరాలకు సరిపోయేలా ప్రయాణికుల విమానాలు తయారు చేయడానికి అవకాశం లభిస్తుంది. ఇప్పటికే రష్యా సంస్థ 200 విమానాలను తయారు చేసింది. ప్రపంచవ్యాప్తంగా 16 ఎయిర్లైన్ సంస్థలు వీటిని నడుపుతున్నాయి.




## అక్టోబర్29 న ప్రపంచ స్ట్రోక్ దినోత్సవం

ప్రపంచ వ్యాప్తంగా ఎప్పుడు ఏ విధంగా మనిషికి ప్రమాదం ముంచుకొస్తుందో చెప్పలేం. అనారోగ్య బారినపడటం, గుండెపోటులు వంటివి ఈ మధ్య కాలంలో సర్వసాధారణం. వీటితో పాటు బ్రెయిన్ స్ట్రోక్ వంటివి కూడా ప్రాణాలను హరిస్తున్నాయి. దేశంలో మరణానికి రెండో ప్రధాన కారణం, వైకల్యానికి మూడో ప్రధాన కారణంగా కూడా గణాంకాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో అవగాహన కల్పించేందుకు ప్రపంచ స్ట్రోక్ డే నిర్వహిస్తున్నాయి. నేడు ప్రపంచ స్ట్రోక్ దినోత్సవం. ఈ ఏడాది ప్రతి నిమిషం లెక్కించబడుతుందనే థీమ్తో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి రెండు సెకన్లకు, ప్రపంచంలో ఎక్కడో ఒక చోట, స్ట్రోక్ కారణంగా ఒక వ్యక్తి జీవితం కోల్పోతున్నాడు.



కొన్ని సార్లు మరణం అంచుల వరకు వెళ్లి...ప్రాణాలతో బయటపడ్డప్పటికీ మంచానికే పరిమితం అవుతుంటారు. వీటికి ప్రధాన కారణం రక్త సరఫరా తగ్గడం. మెదడుకు రక్త ప్రసరణ నిలిచిపోవడం వల్ల మెదడు కణాలకు ఆక్సిజన్ అందనప్పుడు స్ట్రోక్ వస్తుంది. స్ట్రోక్ లక్షణాలను త్వరగా గుర్తించి వైద్యం అందిస్తే... ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుంది. స్ట్రోక్ వచ్చినప్పుడు




లక్షణాలను గుర్తించడానికి FAST అనే పదాన్ని ఉపయోగిస్తారు. F అంటే ముఖం వంకరగా మారడం, A అంటే చేయి పని చేయకపోవడం, S మాటల్లో తడబాటు వంటి లక్షణాలు కనిపిస్తే....వెంటనే అత్యవసర వైద్య సేవల కోసం కాల్స్ చేయాల్సిన సమయాన్ని T సూచిస్తుంది. ఈ స్ట్రోక్కు గురైన సందర్భంలో మెదడును కాపాడటానికి సమయం చాలా ముఖ్యం. ఆస్పత్రి చేరుకోవడంలో ఆలస్యం అతిపెద్ద సవాలుగా వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే గతంలో 60 ఏళ్లు పైబడిన వారిలో స్ట్రోక్కు గురయ్యేవారు. దీనికి భిన్నంగా ప్రస్తుతం బ్రెయిన్ స్ట్రోక్ రోగుల్లో 15 నుంచి 20 శాతం మంది 45 సంవత్సరాల కంటే తక్కువ వయసు గల వారు ఉంటున్నారని నిపుణులు అంటున్నారు. దేశంలో ఏటా 1.5 నుంచి 1.8 మిలియన్ల స్ట్రోక్ కేసులు నమోదవుతుంటే, తెలుగు రాష్ట్రాలలో 1,00,000 జనాభాకు 275 మందిలో స్ట్రోక్ కేసులు నమోదవుతున్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ వ్యాధులకు మారుతున్న జీవనశైలి ప్రధాన కారణంగా వైద్యులు చెబుతున్నారు. దీర్ఘకాలిక ఒత్తిడి, నిద్రలేమి ప్రధాన కారణం. పొగ తాగడం, మద్యం సేవించడంతో పాటు ఆహారపు అలవాట్లు, మధుమేహం, ప్రాసెస్డ్ ఫుడ్ రక్తపోటు తదితర వ్యాధుల పెరుగుదలకు దారి తీస్తున్నాయి. మహిళలతో పోలిస్తే మగవారిలో స్ట్రోక్ ఎక్కువ సంభవించే అవకాశం ఉందని ఇటీవల గుర్తించారు. దేశంలో మరణానికి రెండో ప్రధాన కారణం, వైకల్యానికి మూడో ప్రధాన కారణంగా కూడా గణాంకాలు చెబుతున్నాయి. ఈ వ్యాధి బారిన పడకుండా అవగాహన అత్యంత ముఖ్యమని వైద్య నిపుణులు చెబుతున్నారు.

## డీప్ ఫేక్ మోసాలకు 'సేఫ్ వర్డ్'తో చెక్

టెక్నాలజీ సాయంతో విస్తరిస్తున్న డీప్ఫేక్ మోసాలపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రజలను అప్రమత్తం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఉపయోగించి మనకు తెలిసిన వారి ముఖం, గొంతును సృష్టించి మోసాలకు పాల్పడుతున్నారని.. ఇలాంటి వాటి నుంచి రక్షణ పొందేందుకు 'సేఫ్ వర్డ్' (సీక్రెట్ కోడ్) ఒకటే సురక్షితమైన మార్గమని సజ్జనార్ సూచించారు. సైబర్ నేరగాళ్లు మన కుటుంబ సభ్యులు లేదా స్నేహితుల ముఖం, గొంతును ఏఐ టెక్నాలజీతో క్లోన్ చేస్తున్నారని అన్నారు. ఆ తర్వాత మనకు వీడియో లేదా ఆడియో కాల్ చేసి, తాము ఏదో అత్యవసర పరిస్థితుల్లో చిక్కుకున్నామని నమ్మించి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. అచ్చం మనకు తెలిసిన వారిలాగే మాట్లాడటంతో చాలామంది సులభంగా మోసపోతున్నారని అన్నారు. ఈ తరహా మోసాలు దేశవ్యాప్తంగా పెరిగిపోతున్నాయని, ఈ ఏడాది చివరి నాటికి వీటి వల్ల సుమారు రూ.70,000 కోట్ల నష్టం వాటిల్లవచ్చని 'పై-ల్యాబ్స్' నివేదిక అంచనా

వేసినట్లు సజ్జనార్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఈ డీప్ఫేక్ మోసాల బారిన పడకుండా ఉండేందుకు కుటుంబ సభ్యులు, సన్నిహితులు ముందుగానే ఒక 'సేఫ్ వర్డ్' లేదా రహస్య కోడ్ను ఏర్పాటు చేసుకోవాలని సజ్జనార్ సూచించారు. ఎప్పుడైనా మీకు తెలిసిన వారి నంబర్ నుంచి గానీ, కొత్త నంబర్ నుంచి గానీ కాల్ వచ్చి డబ్బు అడిగితే, ముందుగా ఆ సేఫ్ వర్డ్ను



చెప్పమని అడగాలి. వారు సరైన పదం చెప్పలేకపోతే అది మోసపూరిత కాల్ అని గుర్తించాలన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ వాస్తవాలు నిర్ధారించుకోకుండా డబ్బు పంపవద్దని సజ్జనార్ స్పష్టం చేశారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని, కేవలం రూపం, స్వరం చూసి మోసపోవద్దని సజ్జనార్ హెచ్చరించారు. ఎవరైనా ఇలాంటి డీప్ఫేక్ కాల్స్ చేసి డబ్బులు అడిగితే, వెంటనే మోసమని గ్రహించి సైబర్ క్రైమ్ హెల్ప్లైన్ నంబర్ 1930కి ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.


## నేడు ఇండియా మారిటైమ్ వీక్-2025లో పాల్గొననున్న ప్రధాని మోదీ

ప్రధాని నరేంద్ర మోదీ నేడు ముంబైలో పర్యటించనున్నారు. ముంబైలోని నెస్కో ఎగ్జిబిషన్ సెంటర్లో జరుగుతున్న ఇండియా మారిటైమ్ వీక్-2025 కార్యక్రమంలో మోదీ పాల్గొననున్నారు. మారిటైమ్ లీడర్స్ కాన్క్లేవ్లో ప్రసంగించనున్నారు. అలాగే ఇవాళ సాయంత్రం గ్లోబల్ మారిటైమ్ సీఈవో ఫోరమ్కు నరేంద్ర మోదీ అధ్యక్షత వహిస్తారు. మారిటైమ్ వీక్ కార్యక్రమంలో పాల్గొంటున్నట్టు ప్రధాని ఎక్స్ వేదికగా తెలిపారు. సముద్ర రంగంలో సహకారం, సముద్ర ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలను తెలియజేయడానికి ఇది ఒక గొప్ప వేదిక ప్రధాని మోదీ అన్నారు. ఇండియా మారిటైమ్ వీక్ లో 85 కి పైగా దేశాలు, లక్ష మంది ప్రతినిధులు, 500 కి పైగా ప్రదర్శనకారులు పాల్గొననున్నారు. సోమవారం ప్రారంభమైన ఇండియా మారిటైమ్ వీక్-2025లో ఓడరేవు మౌలిక సదుపాయాలు, గ్రీన్ ఎనర్జీ, రక్షణ నౌకానిర్మాణ రంగాలలోని సముద్ర నిపుణులు చర్చలు జరిపారు. సుస్థిర సముద్ర వృద్ధి, వాణిజ్య విస్తరణ బ్లూ ఎకానమీ అభివృద్ధి




కోసం భారత్ దృష్టి సారించింది. ఈ శిఖరాగ్ర సమావేశంలో భాగంగా, గ్రీన్ మారిటైమ్, ఇన్లాండ్ వాటర్వేస్, మారిటైమ్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ, క్రూయిజ్, ప్యాసింజర్ ఎకానమీ, గ్లోబల్ సప్లై చైన్లను బలోపేతం చేయడంపై అనేక సెషన్లు జరిగాయి.

## నిజాం దురాగతాలపై పోరాడిన వీరుడు కొమరం భీమ్



నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన వీరుడు కొమురం భీమ్ గురించ మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రస్తావించారు. యావత్ భారతదేశంలో ఆంగ్లేయులు దోపిడీ అన్ని హద్దులను దాటేశారని.. ఆ కాలంలో హైదరాబాద్‌లోని దేశభక్తులకు అణిచివేత కాలం చాలా భయానకంగా ఉండేదన్నారు. నిజాం పాలనలో పేదవారు, ఆదివాసీ సముదాయాలపై అత్యాచారాలకు అంతే లేకుండా పోయిందన్నారు. వారి భూములను జప్తు చేసుకుని, పన్నులను అధికంగా విధించేవారన్నారు. ఈ అన్యాయానికి ఎవరైనా ఎదురెళ్తే.. వారి చేతులను సైతం నరికివేసే వారని తెలిపారు. ఇలాంటి కఠిన పరిస్థితులలో ఒక ఇరవై ఏళ్ల యువకుడు ఈ అన్యాయానికి ఎదురు నిలబడ్డాడని అన్నారు. నేడు ఒక ప్రత్యేకమైన కారణంతో ఆ యువకుడి గురించి చెబుతున్నానని అన్నారు. ఆయన పేరును చెప్పే ముందు అతని వీరత్వం గురించి చెబుతానని అన్నారు. నిజాంకు వ్యతిరేకంగా ఒక్క మాట కూడా మాట్లాడడమే పాపంగా పరిగణించే కాలంలో, ఆ యువకుడు సిద్ధికీ అనే నిజాం అధికారికి బహిరంగ సవాల్‌ను విసిరాడని తెలిపారు. నిజాం సిద్ధికీ ని రైతుల పంటలను జప్తు చేయడానికి పంపించాడని అన్నారు. ఈ దారుణానికి వ్యతిరేకంగా జరిగిన సంఘర్షణలో ఆ యువకుడు సిద్ధికీని చంపేశాడన్నారు. నిజాం సేనకు బందీ అవ్వకుండా తప్పించుకోగలిగాడని చెప్పారు. నిజాం పాలకుల నుండి తప్పించుకుంటూ ఆ యువకుడు వందల కిలోమీటర్ల దూరం ప్రయాణించి అస్సాం చేరుకున్నారని అన్నారు. తాను మాట్లాడుతున్న గొప్ప వ్యక్తి పేరు కొమరం భీమ్. అక్టోబర్ 22న మనం ఆయన జయంతిని జరుపుకున్నామని అన్నారు. కొమురమ్ భీమ్ ఆయువు ఎక్కువ కాలం నిలవలేదని.. ఆయన నలభై ఏళ్ళు మాత్రమే జీవించి ఉన్నారన్నారు. కొమురం భీమ్ తన జీవితకాలంలో ఎంతో మందికి, ప్రత్యేకంగా ఆదివాసీ సముదాయ ప్రజల హృదయాలలో చెరగని ముద్రని వేశారని చెప్పారు. ఆయన నిజాంకు వ్యతిరేకంగా పోరాడే వారి మనసుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారని అన్నారు. 1940లో నిజాం మనుషులు కొమురం భీమ్‌ను హత్య చేశారన్నారు. కొమరం భీం గురించి వీలైనంత ఎక్కువగా తెలుసుకోవాలని యువతను కోరుతున్నానని చెప్పారు. ఆయనకు నివాళులు అర్పిస్తూ కొమురం భీమ్ ప్రజల హృదయాల్లో ఎప్పటికీ నిలిచి ఉంటారని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

## నవంబర్ 4 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఐఎఫ్ డబ్ల్యూజే వజ్రోత్సవాలు



దేశవ్యాపిత జర్నలిస్టుల హక్కుల ఉద్యమంలో 75 వసంతాలు పూర్తి చేసుకున్న ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కిగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) 75వ వార్షి-కోత్సవాలు(వజ్రోత్సవాలు) నవంబర్ 4వ తేదీ నుంచి వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా జరపాలని ని-ర్ణయించినట్లు ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం, వర్కింగ్ కమిటీ సభ్యులు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య తెలిపారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర, జిల్లా కమిటీలు ఈ ఉత్సవాలను ఘనంగా జరపాలని వారు పిలుపునిచ్చారు. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన తొలి జర్నలిస్టుల యూనియన్ గా ప్రసిద్ధిగాంచిన ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ స్థాపించి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా జర్నలిస్టులకు, ఇతర మీడియా సంస్థల ఉద్యోగులకు వారు వజ్రోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంఘం చరిత్ర, సుదీర్ఘ పోరాటాలు వాటి ఫలితాలను ఈ తరం జర్నలిస్టులకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వార-న్నారు. జర్నలిస్టుల హక్కులు పూర్తిగా రక్షించబడాలని కోరు కుంటూ, ఈ ప్రతిష్టాత్మకమైన సంఘం పోరాట లక్ష్యాలను, స్పూర్తిని మరింత ముందుకు తీసుకుపోవాలని వారు జర్నలిస్టులకు పిలుపునిచ్చారు.

పాత్రికేయులు చురుకుగా, వ్యవస్థీకృతంగా ఉంటేనే సురక్షితమైన వాతావరణంలో జర్నలిజం వృత్తిని కొ-నసాగించగలరని, అందుకు సంఘటితంగా ముందుకువెళ్ళేందుకు సమిష్టి సహకారం కొనసాగించాలని కోరారు. ఐఎఫ్ డబ్ల్యూజే వజ్రోత్సవాలను అన్ని జిల్లా కేంద్రాలలో నిర్వహించి జర్నలిస్టుల హక్కుల సాధనకు, సమస్యలపై జరగబోయే పోరాటాలకు పునరంకితం కావాలని వారు పిలుపునిచ్చారు.

## నవంబర్ 5న గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ సమావేశం

గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం నవంబర్ 5వ తేదీ బుధవారం ఉదయం 10గంటలకు చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో జరుగుతుం-దని సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి సోమయ్య, బొల్లం శ్రీనివాస్ లు తెలిపారు. సొసైటీకి సంబం-ధించిన పలు విషయాలపై సర్వసభ్య సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు ఇండ్లు, ఇళ్లస్థలాల సాధన కోసం 2008 లో ఏర్పడిన ఈ సొసైటీలో దాదాపు 1400 మంది జర్నలిస్టులు సభ్యులై ఉన్నారని, చాలా మంది సీనియర్ జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం 17 ఏళ్లుగా ఎదురు చూస్తున్నారని,ఇండ్ల స్థలాలు పొం-దకుండానే చాలా మంది జర్నలిస్టులు చనిపోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ సొసైటీకి స్థలం ఇవ్వాలని కోరుతూ ముఖ్య మంత్రికి, మంత్రులకు పలు మార్లు వినతి పత్రాలు సమర్పించడం జరిగిందని, అయినప్పటికీ ప్రభుత్వం సుప్రీం కోర్టు తీర్పును అడ్డం పెట్టుకొని జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా తీవ్ర జాప్యం చేస్తుందని వారు ధ్వజమెత్తారు.నవంబర్ 5వ తేదీన జరిగే సొసైటీ జనరల్ బాడీ మీటింగ్ లో భవిష్యత్ కార్యాచరణపై కీలకమైన నిర్ణయం తీసుకో-వడం జరుగుతుందని తెలిపారు. అత్యంత కీలకమైన ఈ సర్వసభ్య సమావేశానికి సొసైటీ సభ్యులందరు తప్పని సరిగా ఉదయం 10 గంటల కల్లా హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

# మహా మనిషి..ప్రముఖ సాహితీవేత్త.. శ్రీ కొల్లూరి



డా. పోడూరి శ్రీనివాసరావు

లయన్ కొల్లూరి, X Ray కొల్లూరి అంటే వర్ధమాన కవులు, రచయితల దగ్గర్నుంచి, వివిధ సేవా కార్యక్రమాల నిర్వాహకులకు, లయన్స్ క్లబ్, వాకర్ క్లబ్ సభ్యులకు, ఇరు తెలుగు రాష్ట్రాల్లో తెలియని వారుండరు. అదే కొల్లూరి సూర్యనారాయణమూర్తి ఎవరంటే సన్నిహితులు సైతం తెల్లమొహం వేస్తారు. వర్ధమాన కవులను ప్రోత్సహించడమే ధ్యేయంగా, సమాజ సేవే ధ్యేయంగా పెట్టుకున్న శ్రీ కొల్లూరి X Ray సాహిత్య సేవ సంస్థ ను స్థాపించి గత నలభై సంవత్సరాలుగా, నిర్విఘ్నంగా జాతీయ స్థాయిలో కవితల పోటీ నిర్వహించి, ఎంతోమంది కవులను ప్రోత్సహించడమే ధ్యేయంగా పెట్టుకున్న సాహితీ వేత్త శ్రీ కొల్లూరి. విజయవాడ నగరంలో సాహితీ సభల నిర్వహణ అంటే శ్రీ కొల్లూరి ప్రమేయం, ఆధ్వర్యం ఉండాల్సిందే. శ్రీ కొల్లూరి గారు లేని విజయవాడను, సాహితీ కోణం లో ఊహించుకోలేం. అక్టోబర్ 16 వ తేదీ సాహితీ ప్రపంచాన్ని చిమ్మ చీకట్లు కమ్ముకున్న రోజు. రాత్రి సుమారు ఏడు గంటలకు, శ్రీ కొల్లూరి గారు మనలను వీడి, స్వర్గస్థులయ్యారన్న వార్త విని అచేతుడిని అయిపోయాను.



ఇప్పుడు ఆ మహనీయ వ్యక్తి గురించి కొన్ని విషయాలు తెలుసుకుందాం.... ప్రముఖ కవి, ఎక్స్ రే సాహిత్య సేవాసంస్థ వ్యవస్థాపకులు, మినీ కవితా సారధి కొల్లూరి (ఒంటి పేరు సూర్యనారాయణమూర్తి అయినా ఇంటి పేరుతోనే లబ్ద ప్రతిష్ఠులు) అక్టోబర్ 16 న రాత్రి 7 గం.08 నిమిషాలకు గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన వయసు 69 (జననం 1956). ఆయనకు భార్య కనకవల్లి (పద్మావతి వర్సిటీ విశ్రాంత ఉద్యోగిని) కుమార్తె (శ్రీమతి క్షీరజ) ఉన్నారు. తాడేపల్లి లోని మణిపాల్ ఆసుపత్రిలో కాలికి చికిత్స నిమిత్తం అక్టోబర్ 6 న చేరిన కొల్లూరి ఆపరేషన్ జరిగి అంతా సవ్యంగానే ఉందనుకునేలోపు కిడ్నీ సమస్యలు తలెత్తి డయాలసిస్ దాకా వెళ్ళి ఉన్నట్టుండి గురువారం రాత్రి గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు.

ఆంధ్రా బ్యాంకు అధికారిగా జీవితం ఆరంభించిన కొల్లూరి అమలాపురంలో వంశపారంపర్య కొల్లూరి సత్రం నిర్వహించేవారు. ప్రముఖ సినీ దర్శక రచయిత శ్రీ విజయ బాపినీడు తెచ్చిన చిరంజీవి పత్రికకు సంపాదక సారథ్యం వహించేందుకు ఆంధ్రాబ్యాంకు ఉద్యోగం వదిలిపెట్టి మద్రాసు వెళ్ళారు. 1993లో విజయవాడ చేరుకుని బావమరిది సాయంతో కొంతకాలం అంజలి వారపత్రిక నడిపారు. అంతకుముందే X Ray పేరుతో అచ్చంగా కవిత్వం కోసం ఓ పత్రిక నడిపారు. మహాకవి శ్రీశ్రీ కూడా మినీ కవిత్వానికి వేదికగా నిలిచిన ఆ పత్రికకు చందా మొత్తాన్ని మనియార్డర్ చేశారు. మినీ కవితా సారథిగా కొల్లూరి పేరు గడించారు. సాంస్కృతిక రాజధానిగా పేరొందిన విజయవాడలో 90 వ దశకంలో ఉన్న పఠంగా స్తబ్ధత ఆవరించగానే ఎక్స్ రే పేరుతో సాహిత్య సేవా సంస్థను ఏర్పాటు చేసి నెలనెలా వెన్నెలతో పాటు మరెన్నో పెద్ద కార్యక్ర-

మాలు చేపడుతూ సాహిత్య వాతావరణం ఉట్టిపడేలా చేశారు. సినారెను విజయవాడలో ఆంజనేయ విలాస్ హోటల్ పై సభా కార్యక్రమానికి విజయవాడ రప్పించారు. దిగంబర కవులు నిఖిలేశ్వర్, జ్వాలాముఖి, నగ్నముని తో పాటు ఇంకా కె.శివారెడ్డి వగైరా ప్రముఖ తెలుగు కవులతో మాంటిస్సోరి కళాశాలలో 24 గంటల కవి సమ్మేళనం నిర్వహించారు కొల్లూరి. ఏటా ప్రధాన నగదు పురస్కారంతో సహా 11 ఉత్తమ కవితలకు ఎక్స్ రే అవార్డులు ఇస్తూ వస్తున్నారు. అది చాలదన్నట్టు కొంతకాలం హరికథా వారోత్సవాలు నిర్వహించారు. అక్కడితో ఆగకుండా మదర్ తెరిసా పేరుతో లెక్కలేనంత మందిని సత్కరించారు. కమ్యూనిస్టుల కంచుకోట బెజవాడలో మహాకవి శ్రీ శ్రీకి విగ్రహం లేకపోవడం చిన్నతనంగా, అవమానంగా భావించి తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో మహాకవి శ్రీ శ్రీ విగ్రహం ఏర్పాటుతో పాటు 2010లో శ్రీ శ్రీ శతజయంతి మహాసభలు ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ పి.ఎం.జె.ఎఫ్..,గవర్నర్ హోదాలో అమెరికా, జపాన్, సింగపూర్, మలేసియా తదితర దేశాలు పక్క ఊరికి వెళ్ళినంత తేలిగ్గా క్షణాల్లో వెళ్ళిపోయాడు... ఆ ఓపిక కి వందనాలు. కరోనా కష్టకాలంలో నిత్యాన్నదానంతో అలుపన్నది ఎరగకుండా శ్రమించారు. వేసవికాలం వచ్చిందంటే చాలు కొన్ని వేల మజ్జిగ ప్యాకెట్లతో పాదచారుల దాహార్తిని తీర్చేవారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ అంజలి చార్టర్ అధ్యక్షులుగా సేవలందించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ గా చేసారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యవర్గ సభ్యుడిగా కూడా చురుగ్గా వ్యవహరించారు. సాంస్కృతిక సేనానిగా, కార్యకర్తగా తెమలని పనులతో తనలోని కవిని చంపేసుకున్నాడు. సన్నిహిత మిత్రులు కొల్లూరి కవితాసంపుటి వెలువరిద్దాం అనుకునే లోపు 2 ఏళ్ళ క్రితం ఆంధ్రా ఆసుపత్రి పాలయ్యాడు. కోలుకున్న అనంతరం అమ్మాయి పెళ్లి పనులతో బిజీ అయ్యాడు. ఒక్కగానొక్క కూతురికి హనుమాన్ జంక్షన్లో పెళ్లి చేసి 8 నెలలు దాటుతోంది. కవులందరికీ న్యాయం చేసిన మా కొల్లూరికి చాలా అన్యాయమే జరిగింది. ఆయన కవితాపొత్తం బయటికి రాకపోతే రాకపోయే.... అక్టోబర్ 14 న అమెరికా నుంచీ వాలిపోయిన కూతురు... మనవడి నో, మనవరాలి నో కొద్దిరోజుల్లో చేతుల్లో పెట్టబోతున్న మధుర క్షణాల్లో ఆ ముచ్చట తీరకుండానే కొల్లూరి వారసుడి కీ, మనకీ ఏకకాలంలో దూరమవడం తట్టుకోలేని విషయం. నిరంతర సేవా తత్పరుడు లయన్ కొల్లూరి ఆకస్మిక మృతికి పలువురు నగర ప్రముఖులు, కవులు, రచయితలు, పుస్తక ప్రచురణకర్తలు ఖిన్నులయ్యారు. మరణానంతర దేహాన్ని వైద్యాలయానికి రాసిచ్చారు శ్రీ కొల్లూరి. 17 వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు భౌతికకాయాన్ని వైద్యులు వైద్యాలయానికి తరలించారు. ఆ లోపు విజయవాడ ఏలూరు రోడ్డులో రామ మందిరం దగ్గర గల ఆదాం వాచీ కంపెనీ పక్కనే కొల్లూరి వారి స్వగృహంలో ఉంచిన పార్థివదేహాన్ని అభిమానులు, కవులు, రచయితలు, లయన్స్ క్లబ్ సభ్యులు, వాకర్ క్లబ్ సభ్యులు, మిత్రులు దర్శించుకుని ఆఖరి కైమోడ్పులు సమర్పించారు. ఇన్నాళ్ళూ కవితలకి వేదికలిచ్చి, కవులకు గుర్తింపు, సముచిత స్థానం, గౌరవం ఇచ్చిన కవి కొల్లూరికి అభిమానులంతా కవితా సుమాలై రుణం తీర్చుకున్నారు. శ్రీ కొల్లూరి పార్థివ రథ యాత్ర ఒక ఉత్సవంలా, వేడుక లా జరిగింది. ఇదే మనం మన మిత్రుడు, సాహితీ దిగ్గజం, ఎందరో వర్ధమాన కవులు, రచయితలకు మార్గదర్శి శ్రీ కొల్లూరి కి సమర్పించే ఘనమైన నివాళి. శ్రీ కొల్లూరి తో నాకు గల సుమారు పాతి సంవత్సరాల పరిచయం తో, నాకు తెలిసిన విషయాలతో, ఈ వ్యాసం వ్రాయడం జరిగింది.. శ్రీ కొల్లూరి కి నివాళి గా. తప్పులుంటే మన్నించగలరు. నేను చిత్రించిన శ్రీ కొల్లూరి చిత్రపటం కూడా నివాళి గా సమర్పించుకుంటున్నాను.

డా. పోడూరి శ్రీనివాసరావు

# సుశీలా నారాయణరెడ్డి పురస్కార గ్రహీత శ్రీమతి స్వాతి శ్రీపాద



**తుమ్మూరి రాంమోహన్ రావు**

సుప్రసిద్ధ రచయిత్రి, కవయిత్రి, అనువాదకురాలు శ్రీమతి స్వాతి శ్రీపాద గారి గురించిచెప్పేముందు కొంచెం స్వగతం చెప్పాలి. చిన్నతనం నుండే పత్రికలు చదివే అలవాటుండడంతో ఎంతో మంది రచయితలు రచయిత్రుల పేర్లు మనసులో నిలిచిపోయాయి. ఏ కథ ఏ పత్రికలో ఎప్పుడు చదివానో గుర్తులేదు కానీ స్వాతిశ్రీపాద పేరు మాత్రం మనసులో ఉండిపోయింది. నేను రచనా వ్యాసంగం లోకి రాక ముందు మంచి పాఠకుణ్ణి. మామూలుగా పత్రికలు చదివే అలవాటున్న వారికి రచయితలు, రచయిత్రులు అంటే ఒక క్రేజ్ ఉంటుంది. వారిని కలిసే అవకాశం వస్తే అదొక మంచి అనుభూతి. కాగజ్ నగర్ లో ఉన్న కాలంలో మా తెలుగు సాహితీసదస్సు కార్యనిర్వాహకుడిగా కొందరు సాహితీ పరులను ఆహ్వానించి కార్యక్రమాలుఏర్పాటు చేయటం జరిగేది. ఆ వచ్చిన వారిని ఎంతో అభిమానంతో ఆదరించి సత్కరించటం, కొన్ని సార్లు మా ఇంట్లోనే ఆతిథ్యం ఇవ్వడం ఎంతో ఆనందం కలిగించేది. ఇదంతా చెప్పడం ఎందుకంటే సాహితీ సృజన కారుల మీద ఏర్పడేగౌరవం ఇప్పటి భాషలో చెప్పాలంటే క్రేజ్ ఎలా ఉంటుందో తెలుపడానికి. నా ఉద్యోగవిరమణ తరువాత నేను హైదరాబాద్ చేరు కోవటం, నేను నాటకరంగం నుండి రచనా రంగంలో కాలు పెట్టడం వల్ల అనేక సాహిత్య కార్యక్రమాలకు హాజరవటం అనేక మంది లబ్ధ ప్రతిష్ఠులను కలుసుకోవడం ఒక రకమైన ఆనందానుభూతిని కలిగించేది.



ముఖ్యంగా ఆత్మీయ మిత్రులు తాళ్లపల్లి మురళీధర గౌడు చిరకాలంగా హైదరాబాదు లో ఉండటమే కాకుండా యువభారతి కార్యకర్త కూడా కావడంతో సుప్రసిద్ధులైన కవులూ రచయితలూ ఆయనకు సుపరిచితులు కావడంతో అనేకమందిని పరిచయం చేసారు. అలా ఆ మిత్రుడు పరిచయం చేసిన రచయిత్రి శ్రీమతిస్వాతి శ్రీపాద. మురళీధర్ గౌడు గారు పుస్తక ప్రచురణను వ్యాపకంగా పెట్టుకోవడంతో వారు వేసిన పుస్తకాలు నా కిస్తూండటం అలా స్వాతిగారి పుస్తకంచదివి ముందుగా ఎందుకో చిన్న అమ్మాయి అయినా చాలా బాగా రాస్తుందిఅనుకున్నాను కూడా. కానీ వారి పరిచయం అయిన తరువాత సమవయస్కులం అని తెలిసింది. వారిదీ నాలాగే ఉపాధ్యాయవృత్తి అని కూడా తెలిసింది. వారిపుస్తకాలు మా మిత్రుడు ప్రచురించే క్రమంలో వారి వెంబడి నన్ను రెండు మూడుసార్లు తీసుకు వెళ్లడం అలా మొత్తానికి పరిచయం మంచి మైత్రిగా మారింది. ఇంకాచెప్పా-

లంటే ఒక అభిమాన రచయిత్రి మైత్రి ఏర్పడటం ఒక సుకృతం. దీనికి తోడు వారిపిల్లలు, మా పిల్లలు అమెరికాలో స్థిరపడటం, మేము అమెరికా వెళ్లి రావడం మాఉమ్మడి అనుభవాలను వెలార్చుకునే అవకాశం రావడం, ఇద్దరమూ యు.ఎస్. లోచేరో నగరంలో ఉన్న సందర్భమూ ఉంది. అక్కడ ఉన్న సమయం లో ఫోన్లో గంటలతరబడి సాహిత్యవిషయాల చర్చ మంచి కాలక్షేపం గా ఉండేది.

అనుభవజ్ఞురాలు, లబ్ధప్రతిష్ఠురాలైన స్వాతి శ్రీపాద గారి పరిచయంచేసే అవకాశం ఏర్పడటం ఆనందంగా ఉంది. స్వాతి శ్రీపాద గారి రచనా ప్రాంగణంచాలా విశాలమైనది. రచయిత్రిగా ఎంత ప్రసిద్ధురాలో, కవయిత్రిగా అంతప్రసిద్ధురాలు. దీనికి తోడు ఆమె కేంద్రీయ విద్యాలయం ఆంగ్ల బోధకురాలు కావడంతో అనువాద ప్రక్రియను కూడా చేపట్టడంతో మంచి అనువాదకురాలుగా కూడా పేరుపొందారు. చాలా మంది అనువాదకులు సాధారణంగా, అయితే తెలుగు నుండి ఆంగ్లంలోకో లేదా ఆంగ్లం నుండి తెలుగులోకో ఏదో ఒకటి మాత్రమే చేస్తుంటారు. కానీ స్వాతి గారికి రెండు విధాల అనువాదాలు చేసే అవకాశాలు లభించాయి. కనుకస్వాతి శ్రీపాదగారి రచనా వ్యాసంగం విస్తృత మైనది.

ఇక వారి జీవన రేఖలవైపు వెళితే వీరు 1953 లో జూలై నెల పదహారవ తేదీననిజామాబాద్ దగ్గర బీర్కూరులో జన్మించారు. తండ్రి ఆంధ్రప్రాంతం నుండి వచ్చిఅక్కడ బీర్కూరులో స్థిరపడిపోయి నిజామాబాదు అమ్మాయినే చేసుకోవడంజరిగింది. అందుకే స్వాతిగారు మాత్రం అచ్చంగా తెలంగాణ ఆడపడుచు అనిచెప్పాలి. ఈ మాట చెప్పడంలో ముఖ్య ఉద్దేశం కొన్ని సందర్భాల్లో ఆంధ్రప్రాంతరచయిత్రిగా భావించబడి కొంత వివక్షకు గురికావడం నాకు తెలుసు కనుక. పుట్టిందిక్కడే, పెరిగిందిక్కడే చదువులన్నీ ఇక్కడే ఉద్యోగం చేయడం, స్థిరపడటంఅన్నీ ఇక్కడే. చదువులన్నీ అనడంలో ఓ విశేష ముంది . మొదట్లో నిజామాబాద్ డిగ్రీకళాశాలలో బి.ఎస్సీ చేసారు. అప్పుడే ఆంధ్రా బ్యాంకు ఉద్యోగి రమేశ్ సాగర్ గారితోవివాహం జరిగింది. ఆ తరువాత వారి ప్రోత్సాహంతో ,ఎం.ఏ (ఇంగ్లీష్), ఎం.ఏ (తెలుగు), బి.ఎడ్., సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్(సి.ఐ.ఇ.ఎఫ్.ఎల్) నుండి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ టీచింగ్ ఇంగ్లీష్ (పి.జి.డి.టి.ఇ) మరియు ఇంగ్లీష్ క్రియేటివ్ రైటింగ్ లో పీజీ డిప్లొమా తీసుకున్నారు . వారి అర్ధాంతర మరణం వారిని క్రుంగదీసినా తేరుకుని, వారి జ్ఞాపకాలనేప్రోద్బలంగా మార్చుకుని సాహిత్యైకజీవనోపాసన చేస్తున్నారు.

వీరు వృత్తిపరంగా కేంద్రీయ విద్యాలయంలో ఆంగ్లోపాధ్యాయినిగా 1988 నుండి 2010 వరకు పనిచేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసారు. ఇక స్వాతి శ్రీపాదగారి రచనా రంగం వైపు చూస్తే, పూవు పుట్టగానే పరిమళించునన్న సామెత గుర్తుకువస్తుంది. పదేళ్ల ప్రాయంలోనే జవాహర్లాల్ నెహ్రూ మరణించిన సందర్భాన్ని పురస్కరించుకొని గేయం రాసారు. అలా మొదలైన ప్రస్థానం పాఠశాల స్థాయిలో ఆతరువాత కళాశాల స్థాయిలో, అనేకసార్లు సాహిత్య పోటీల్లో పాల్గొని, వేదికలెక్కి ప్రశంసలతో పాటు అనేక బహుమతులు పొందుతూ పదహారవ ఏటికే జాకీ అనే కథరాయటం, అది వసుధ పత్రికలో ప్రచురణ కావడంతో ఊపందుకొంది.

1969 లోనే ప్రముఖ సాహితీ సంస్థ ఇందూరు భారతి సంయుక్త కార్యదర్శి గాపనిచేయడం, 1970లో మరో ముగ్గురు స్థానిక కవులతో కలిసి 'చౌరస్తా' అనే కవితాసంకలనం వెలువరించారంటే వారి సాహిత్యాభిలాష ఎంతటిదో-ఊహించవచ్చు. ఎక్కడ కవిసమ్మేళనం జరిగినా ఉత్సాహంగా పాల్గొనడం, ఇందూరు భారతి సాహిత్య కార్యక్రమాల్లో చురుకుగా పనిచేయడం, అనేకమందిసాహితీ వేత్తలతో పరిచయాలేర్పడటం వీరి సాహితీ వ్యాసంగానికి మంచి గుర్తింపువచ్చింది.

1969-74 మధ్య కాలంలో కృష్ణాపత్రిక, పల్లకి, స్రవంతి, విశ్వరచన, మయూరి, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి వంటి అనేక

పత్రికల్లో సుమారు 200 కథలు-ప్రచురిత మయ్యాయంటే స్వాతి-గారి రచనా వేగం ఎంతటిదో తె-లుస్తుంది. మొదటినుండీ సవ్య సాచిలాగా అటు కవిత్వం ఇటు కథ రెంటినీ వదలకుండా ఇప్పటి దాకా అదే కొనసాగించడం స్వాతి గారి విశేషం. స్వాతిగారి కథల్లో జీవిత కథనాలు కళ్లకు కట్టినట్లు-గా కనిపిస్తాయి. మంచి చదివిం చే గుణం వీరి రచనల్లో సామాజిక స్పృహ, సమస్యల మూలాలు, పరిష్కార మార్గాలు పాఠకులను ఆలోచింపజేస్తాయి. వీరివచన కవిత్వం కొత్త కొత్త ఉపమానాలతో, కొత్త పదబంధాలతో సాంద్రంగా ఉంటుంది. ఎక్కువగా వీరి కవిత్వం గత స్మృతుల ఆధారంగా ఉన్నా అనేక వైవిధ్య భరిత మై-నకవితలు రాసారు రాస్తున్నారు కూడా. వీరి అనువాద ప్రక్రియ గురించి చెప్పాలంటేప్రత్యేకంగా ఒక వ్యాసమే రాయాల్సి వస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే అనే-కమందికి అనువాదం అనగానే మొదట గుర్తు వచ్చే పేరు స్వాతి శ్రీపాద.

గత ఐదున్నర దశాబ్దాలు-గా వీరు రాస్తూ వస్తున్న కథలు, కవితలు, నవలలు, పుస్తకాలు గా వెలువరిం చబడ్డాయి. ఇప్పటి వరకు ఏడు కథా సంపుటాలు - మౌనవీణ, గోడలు, అవ-తలివైపు, పొరలు, పంజరం విడిచి, మల్లెలు కనకాంబరాలు, పదకొండు నవలలు- అపరిష్కృ-తం, మనోహర స్వప్నం ,పునరాగ-మనం, చిరుజల్లుకురిసేనా, టగ్ ఆఫ్ వార్, చేరేదెటకో తెలిసీ, శిశిర వసంతం, చుక్కాని చిరుదీపం, జీవన వేదం, మరో రెండు ఒకటి చతురలో, ఒకటి మయూరిలో నవలలుగావచ్చాయి. కవితా సంకలనాలు - హృదయంలో అడుగులు, మనసుకు చూపించే, ఎడారులు - ఎండమావులు, నదినై ప్రవహించాలని, సుప్తక్ష-ణం, పోత బొమ్మ, ఇక్కడఎవరైనా ఒకటే ,కలలకు కాలంచెల్లింది, walking together (English) ప్రచురించబడ్డాయి.

ఇక అనువాదాలకు వస్తే ఇంగ్లీషు నుండి తెలుగులోకి పదమూడు పుస్త కాలు, తెలుగు నుండి ఆంగ్లంలోకి ఇరవై ఏడు పుస్తకాలు వెలువడ్డాయి. వ్యాస విస్తరభీతితో వాటిని పేర్కొనడం లేదు. కాకపోతే ప్రఖ్యాత సాహస-వనిత కిరణ్ బేడీ రాసిన I Dare (ఐ డేర్) స్వాతిగారి అనువాదం సాహసి పేరుతో 1997-98 మధ్య-కాలం లో ఆంధ్రజ్యోతి పత్రిక ధారావాహికగా వేయటం. ఒక మచ్చుగా చెప్పవచ్చు.

కొందరి విషయంలో వా-స్తవాలు చెబుతున్నా అతిశయోక్తి అనిపిస్తుంది. దానికివాళ్లు చేసిన అశేషకృషి కారణం. ఒక్కరు ఇంత రచనా ప్రస్థానం కలిగి ఉన్నారా అన్న సందేహం పొడసూపటం సహజం. కానీ సమయం సద్వి-నియోగం చేసుకునే స్వాతిశ్రీ-పాద లాంటి రచయిత్రులకు ఇది ఇష్టసాధ్యం. ఇవేగాక ఎస్.బి.టి. కోసం, దూరదర్శన్ కోసం, ప్రసార భారతి కోసం వీరి సేవలు అం-దించబడ్డాయి. లేఖిని సంస్థకార్య దర్శిగా ప్రతి నెలా కార్యక్రమాలు నిర్వహించడం, వాకిలి వెబ్ మ్యా-గజైన్ సంపాదకులుగా ఉండటం వీరి చైతన్య స్ఫూర్తికి నిదర్శనం గా భావించవచ్చు.

కవయిత్రిగా మంచి కవిత్వం వె-లువరించినా వీరు కథారచయిత్రి గా పేరుపడ్డారు. 82 లో బెర్త్రంపూ-ర్ లో కథావికాసం పురస్కారం, జాగృతి వాకాటి పాండురంగా-రావు కథకు మొదటి బహుమతి పొందిన వీరు తెలుగు విశ్వవిద్యా-లయం కీర్తి పురస్కారం, మరియు ప్రతిభా పుర స్కార గ్రహీత కూడా. ప్రతిభ ఉన్న చోట పురస్కారాల కే-మికొదువ.

అనేక సాహితీసంస్థల పురస్కా-రాలు, పోటీ కథలకు బహుమ-తులు వంటివిఅనేకం ఉన్నాయి. వాసిరెడ్డి సీతాదేవి, తెన్నేటి హేమలత, వంశీ పురస్కారా-లు, రంజని-కుందుర్తి ఉత్తమ కవిత అవార్డు, ఎక్స్ రే ఉత్త-మకవితల అవార్డు సాహిత్యం మరియు అనువాదం కై మహాత్మా పూలే టాలెంట్ అవార్డు, లేఖిని అనువాదానికిఅవార్డు, కృష్ణాజి-ల్లా రచయితల సంఘం నుండి అనువాద పురస్కారం, సిరికో-నకవితా పుర స్కారం వంటివి చాలానే ఉన్నాయి. అయితే ఈ సంవత్సరం ప్రతిష్ఠాత్మకమైన శ్రీమతి సుశీలా నారాయణరెడ్డి పురస్కారం స్వాతి శ్రీపాద గారిని వరించడం విశేషం. స్వాతి శ్రీపాద గారి నుండి ఇంకా రావలసిన పు-స్తకాలు చాలానే ఉన్నాయి, పొం-దవలసిన పురస్కారాలు కూడా!

# కాశీమజిలీ కథలు



ధారావాహిక -ఐదవభాగం

డా. మాదిరాజు బ్రహ్మానంద రావు

వ-ర-ప్ర-సా-దు ల కథ

రాజకుమారుడైన వసంతుడు, మంత్రికుమారుడైన రాముడు, పురోహితుని కుమారు డైన ప్రవరుడు, వైశ్యపుత్రుడైన సాంబుడు, కళాదుని(స్వర్ణకారుని)పుత్రుడైన దండుడు పెరిగి పెద్దవసాగారు. వారైదుగురు మన్మథునితో సమానమైన సుందరులుగా -బృహస్పతితో సమానమైన బుద్ధిమంతులుగా ప్రసిద్ధికెక్కారు. గురువుల వద్ద సాహిత్యం-వ్యాకరణం-తర్కం-జ్యోతిష్యం-సంగీతం-వైద్యం మొదలైన శాస్త్రవిద్యలతో పాటు ధనుర్విద్య-అశ్వవిద్యాది శస్త్రవిద్యలను కూడా క్షుణ్ణంగా అభ్యసించారు. అరువదినాలుగు కళలలో ప్రావీణ్యాన్ని పొంది జనులచేత మంచిమిత్రులుగా వారు కీర్తింపబడ్డారు.

వారైదుగురకు యౌవనం వచ్చింది. తల్లిదండ్రులు వారికి పెండ్లి చేయాలనుకున్నారు. పితరుల అభిప్రాయాన్ని తెలుసుకున్న వారు మొదటగా దేశాటనం చేసి రాజ్య విశేషాలను తెలుసుకొని ఆ తరువాత పెండ్లి చేసుకోవాలనుకున్నారు. లేకపోతే దేశాటన సమయంలో తమకు నచ్చిన కన్యలు ఆయా రాజ్యాల్లో తటస్థపడితే వారిని వివాహం చేసుకోవాలనుకున్నారు. వైశ్య పుత్రుడైన సాంబుడు దేశాటనలో ఎదురయ్యే కష్టనష్టాలను గురించి చెప్పగా మిత్రులందరు తర్జనభర్జనలు చేసి చివరకు దేశాటన చేయటానికే నిర్ణయించుకొన్నారు. తల్లిదండ్రులకు ఈ విషయం తెలియకుండానే దేశాటనను చేద్దామని ఐదుగురు కలిసి ఒక నిర్ణయానికి వచ్చారు. ఒకనాడు అర్ధరాత్రి ఎవరికి తెలియకుండా వారైదుగురు తగినంత ధనం తీసుకొని గుఱ్ఱాలపై అరణ్యమార్గం పట్టి పోసాగారు. రెండు రోజులపాటు వారు కొన్ని యోజనాల దూరం అరణ్యంలో ప్రయాణం చేశారు. రెండోరోజు పగటివేళకు వారికి బంగారు గోపురమొకటి కనిపించింది. వారక్కడ నగరం ఉంటుందని భావించి ఆ బంగారు గోపురం దగ్గరికి వెళ్ళారు. అక్కడ నగరమైతే ఉంది కానీ అందులో నరసంచారం కానరాలేదు. అన్ని ఇంటి తలుపులు మూయబడి ఉన్నాయి. అంగళ్లు కట్టివేయబడి ఉన్నాయి. ఇంతలో వారికి "ఓ పౌరులారా! మీరందరూ నిద్రించండి. అర్ధరాత్రి అయింది. మీ సొత్తును మేము కాపాడుతాం" అన్న రాజభటుల చాటింపు వినబడింది. రాజభటుల చాటింపు విని వరప్రసాదులు ఆశ్చర్యపోయారు. వారు రాజభటులతో "ఇది పగలు కదా! మీరు రాత్రి అని చాటింపు వేస్తున్నారేంటి? " అని ప్రశ్నించారు. అపుడు రాజభటులు వారిని వారించి "ఇది పట్టపగలు అన్నవారిని రాజు శిక్షిస్తాడని దూరంగా వెళ్లి పడుకో"మన్నారు. రాజభటులతో వాదించి ప్రయోజనమేమీ లేదని భావించి వారొక ఇంటి యజమాని అరుగుపై పడుకున్నారు. సాయంత్రమైంది. చీకటి పడసాగింది. జనులందరు నిద్ర లేచినట్లుగా లేచి పగటిపూట పనులు చేసుకున్నట్లుగా తమ తమ పనులు చేసుకోసాగారు. వరప్రసాదులకిది వింత అనిపించింది. ఇంతలో గృహయజమాని లేచి వచ్చి ఇంటి తలుపులు తీసి వారిని లోనికి తీసుకొని పోయి ఆతిథ్యమిచ్చాడు. అప్పుడు వరప్రసాదులు ఇంటి యజమానితో "అయ్యా ఈ నగర ప్రజలందరూ పగటివేళ నిద్రపోతున్నారు.

(ఇంకా ఉంది)

# అత్యున్నత ప్రజ్ఞ జాగృతం కావాలి..



పాలకుర్తి రామమూర్తి

అర్జునుడు సందిగ్ధతతో కొట్టుమిట్టాడుతున్నాడు.. ఎదుటి పక్షంవారు అన్యాయం చేస్తున్నారు.. తాను ఏ చర్య తీసుకున్నా అది ఎదుటి పక్షంవారికే కాదు తమకూ నష్టం చేస్తుంది.. ఇరుపక్షాలకు తీవ్రమైన నష్టం వాటిల్లుతూ చావోరేవో తేల్చుకునే పరిస్థితిలో ముందుకు సాగి ధర్మాన్ని కాపాడాలా.. ఓటమిని అంగీకరించి పిరికివాని వలె వెనుకకు తగ్గి ధర్మహానికి సమ్మతించాలా? ఏం చేయాలో తోచని స్థితిలో కృష్ణుని సహాయం కోరాడు.. కృష్ణుడు చెపుతున్నాడు.. ఉత్తిష్ఠత..జాగృత..స్థిరంగా నిలబడు.. తెలివిగా ఆలోచించు.. సంక్లిష్టమైన సంధికాలంలో బలహీనత పనికిరాదు. కార్యసాధకునికి విచలిత మనస్సు శోభించదు. అర్జునుడు అంటాడు.. అందరూ నావారే అయిన ఈ యుద్ధంలో ఎవరము గెలిచినా .. జరిగే నష్టం నాకే.. నావారిపై నేను యుద్ధం చేయలేను.. నవ్వుతూ కృష్ణుడు అంటున్నాడు.. సంక్షోభాన్ని ఎదుర్కొన్న సమయంలో.. ప్రతివ్యక్తికీ సందిగ్ధత సహజమైనదే.. సంక్లిషతలో సానుకూలతను వెతుక్కుంటావా.. సందిగ్ధతను జోడిస్తావా? సానుకూలత వ్యక్తి వికాసానికి తోడ్పడుతుంది. సమాజానికి ఉపకరిస్తుంది. సరైన నిర్ణయం తీసుకోలేని సమయంలో నిరాశానిస్పృహలు మనసును ఆక్రమించుకుంటాయి.. ఫలితంగా దిగులు పెరుగుతుంది. నీవిప్పుడు బాధలలో ఉన్నావు.. నీ శక్తియుక్తులను ఉత్తేజితంచేయి.. ధైర్యసాహసాలను జాగృతం చేయి. సంక్లిష్ట సమయాలలోనే ఆత్మోద్దీపనం కావాలి.. నీలో అనంతమైన శక్తిసామర్థ్యాలు ఉన్నాయి.. నిన్ను నీవే చైతన్యపరచుకోవాలి.. నీలోని శక్తిసామర్థ్యాలే నీ సమస్య పరిష్కారంలో వనరులు.. అవే వసతులు.. అవే నిన్ను నడిపించే చోదక శక్తులు.. పరిపూర్ణమైన ప్రజ్ఞ లోతుగా, విస్తృతంగా వ్యాప్తంకావాలి. ప్రతి సమస్యకూ పరిష్కారం ఉంటుంది. చీకటి క్రమ్మినప్పుడు ఎదురుగా ఉన్న వస్తువు కనిపించదు.. బాధాతప్త హృదయం పరిష్కారాన్ని కనుగొనలేదు.. సాధించాలనే తపన బలంగా ఉన్నప్పుడు అన్ని శక్తులూ సహకరిస్తాయి. స్థిరత్వం, సమర్థత రెండూ కార్యసాధనకు రెండు కన్నులలాంటివి. అవే సమున్నతత్వానికి మార్గదర్శన చేస్తాయి. బలమైన సంకల్పం.. స్థిరత్వాన్ని ఇస్తుంది.. నైపుణ్యం.. సమర్థతను ఇస్తుంది. స్థిరత్వం.. సమర్థత కలిస్తే.. కార్యం సాక్షాత్కరిస్తుంది. బాధలను ప్రక్కన పెడితే.. కర్తవ్యం గోచరిస్తుంది.. బాధ్యత దానికి తోడైతే.. మార్గం సుగమమౌతుంది.. నిజానికి "బాధలు" అనబడే జబ్బులకు.. "పనిచేయడ"మనేది సరైన ఔషధం.. నిరంతరం అలసట లేకుండా ఉత్సాహంగా పనిచేయడం.. అనేది.. జీవిత ప్రయాణంలో ఉపకరించే ఉత్తమోత్తమ సాధనం.. పనిలో నైపుణ్యమనేది యోగం.. యోగము అంటే పొందదగినది.. నిరంతర ప్రయత్నం, కర్తవ్యదీక్ష.. ఉత్తమత్వాన్ని పొందేందుకు సహకరించే సాధనాలు. అయితే.. పని చేయడం మాత్రమే సరిపోతుందా? అంటే యంత్రంలాగా పనిచేయడం సరికాదు. ప్రయోజనం లేని పనిని చేయడమూ.. సరికాదు. చేసే పనిలో విజ్ఞత ఉండాలి. దానిలో మేధ పనిచేయాలి. సృజనశీలత ఉండాలే కాని "గ్రుడ్డెద్దు చేలో పడినట్లుగా" పనిచేయడం ప్రయోజనాన్ని హరిస్తుంది. జ్ఞానం.. స్పష్టత నిస్తుంది... స్వచ్ఛత నిస్తుంది.. పరిణతినిస్తుంది.. నాణ్యతను మెరుగుపరుస్తుంది.. అనంత-

మైన అంతర్గత శక్తిసామర్థ్యాలను గుర్తించేందుకు, వెలికి తీసుకునేందుకు ఉపకరిస్తుంది. జ్ఞానంతో కూడిన నైపుణ్యాలు.. జ్ఞానం నైపుణ్యాలతో జతకట్టిన కర్తవ్య దీక్ష.. ఉన్నతికి దారిచూపుతాయి. చిత్తశుద్ధితో పనిచేసినప్పుడు.. అనుభవం వస్తుంది.. విషయాన్ని సమగ్రంగా తెలిసినప్పుడే దానిని ఇతరులకు వ్యక్తీకరించగలుగుతాము. పనిచేయడమనే వైఖరిని గాని విజ్ఞానాన్ని గాని ఒకటి ఎక్కువ మరొకటి తక్కువ అని చెప్పలేము. రెండు ఉత్తమమైనవే.. వ్యక్తి పురోగతిలో రెండూ అవసరమే. నిజానికి రెండు కలిస్తేనే అభివృద్ధి.. అభ్యుదయం. అంతేకాదు.. ఏమిటి, ఎక్కడ, ఎందుకు, ఎప్పుడు, ఎవరు, ఎలాగా.. ఈ ప్రశ్నలు వేసుకొని ముందుకు సాగినవేళ పరిణతి కలుగుతుంది. పరిణతి వల్ల ఫలితం పట్ల ఆసక్తి సన్నగిల్లుతుంది.. ప్రక్రియపై శ్రద్ధ పెరుగుతుంది. అప్పుడు పని ఇతరులకు సహకారంగా పరిణమిస్తుంది.. పంచుకోవడం.. పెంచుకోవడం అలవడుతుంది..నిస్వార్థ చింతన వ్యక్తిత్వాన్ని వ్యక్తిమత్వంగా తీర్చిదిద్దుతుంది.. వ్యక్తిలో జాత్యంతరీకరణ జరుగుతుంది. అదే అత్యద్భుతమైన వికాసంగా వ్యక్తికి తన్మయత్వాన్ని కలిగిస్తుంది.. అసంకల్పితంగానే ఫలితాలు అందివస్తాయి. పనిని యోగంగా భావించడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది.. ఆత్మ నిగ్రహం అలవడుతుంది. ఆత్మయే ఉత్తమ స్నేహితుడు.. ఆత్మయే బలమైన శత్రువు, అంటారు పెద్దలు. వ్యక్తిలో కలిగిన జాత్యంతరీకరణ వల్ల త్రికరణ (మాటలు, చేతలు, ఆలోచనలు) శుద్ధిగా స్పందించడం జరుగుతుంది. సమభావన, సమదృష్టి (సమవర్తన కాదు) అలవడతాయి. జ్ఞానం బుద్ధితో జతకట్టి.. పనిచేత పునీతమైనప్పుడు, అనుభవం ద్యోతకమౌతుంది. అనుభవం నైపుణ్యాన్ని పెంచుతుంది. స్వానుభవం వల్ల వివేచన, విజ్ఞత పల్లవిస్తాయి. దానినే విజ్ఞానం అందాము. విజ్ఞానం, నైపుణ్యాలు కలిస్తే సంతృప్తితో కూడిన విజయం ఆవిష్కృతమౌతుంది.. తెలుసుకోవడం, తెలిసిన దానిని నిశ్చయించుకోవడం వివేచన లేదా విజ్ఞత అనబడుతుంది. పరిమళ భరితమైన వివిధ రకాల పూవులు హారంగా మనోహరంగా ఉంటాయి.. కాని వాటిని ఏ పూవును ఎక్కడ అమర్చాలో తెలిసి అమర్చడం వల్లనె ఆ హారానికి ఆ సౌందర్యం వస్తుంది.. అలా హారంగా మలచడానికి కావలసింది దారం.. దారం ఎక్కడా కనిపించదు.. అయినా హారంయొక్క విలువను పెంచుతుంది. బాధ్యత గలిగిన నాయకుడు సమాన హృదయులైన వ్యక్తులతో బృందాన్ని ఏర్పరచి ఒకే లక్ష్యంకోసం పనిచేస్తే ఆ పని విలువ అమితంగా పెరుగుతుంది. బృందంలోని ఒక్కొక్క సభ్యుని విలువకన్నా బృందంయొక్క సమష్టి విలువ చాలా హెచ్చుగా ఉంటుంది. దండలో దారంగా నాయకుడు తానే కార్యసాధనలో మూలమని భావించకుండా.. బృంద సభ్యులను ప్రదర్శిస్తే ఆశించిన దానికన్నా ఎక్కువ ఫలితాన్ని ఆస్వాదించగలడు. నిజానికి బాధ్యత తెలిసిన నాయకత్వమే సమాజాన్ని కలపడమనేది అత్యుత్తమ ఫలితాలను ఆవిష్కరించేందుకు మూలం. సమగ్రత, సంపూర్ణత సమష్టి చైతన్యంతోనే అది సాధ్యపడుతుంది. వ్యష్టి సమష్టిగా మారడమే.. ఆధ్యాత్మికత. ఆధ్యాత్మికతను (సంప్రదాయకంగా కాకుండా) మరొక విధంగా నిర్వచించుకుంటే.. అది బాధ్యతా నిర్వహణయే. అంకితభావనతో చేసే పనియే ఆరాధన.. చేసే వృత్తిపట్ల అంకితభావం, జవాబుదారితనం, బాధ్యత.. నిబద్ధత కలిగిన నాయకుని నిర్వహణలో అత్యుత్తమ ఫలితాలు ఆవిష్కృతమౌతాయి. వ్యక్తిగతంగా, కుటుంబపరంగా, వృత్తిపరంగా, సమాజపరంగా తన బాధ్యతను నిర్వహించిన వ్యక్తిని ఆదరణీయునిగా చెప్పుకోవాలి. అదే వ్యక్తిలోని ఉత్తమత్వాన్ని ఆవిష్కృతం చేస్తుంది. ఆకర్షణలు.. వ్యక్తిని క్రిందికి లాగుతుంటాయి.. ప్రలోభాలు.. పతనావస్థకు మార్గం చూపుతాయి. అడ్డంకులు.. పిరికివానిని చేస్తాయి. ఆశ్రితపక్షపాతం.. అసమర్థుడిని చేస్తుంది..

(48 వ పేజీ చూడండి)

# బ్రహ్మఖండం



డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ

శంఖ తీర్థం

బ్రహ్మ హత్యా విమోచనానికి శివతీర్థంలో స్నానం చేసాక శంఖ తీర్థాన్ని సేవించాలి. శంఖ తీర్థంలో స్నానం చేస్తే కృతఘ్నునికి మోక్షం లభిస్తుంది.

పూర్వం శంఖుడు అను ముని గంధమాదన పర్వతంపై తపస్సు చేస్తున్నాడు. శంఖుడు అక్కడఒక తీర్థాన్ని నిర్మించాడు. ఆ తీర్థం దగ్గర " వత్సనాభుడు" అను ముని తపస్సు చేసుకుంటూఉండేవాడు. అనేక సంవత్సరాలు తపస్సు చేయడం వలన అతని శరీరం మీద పుట్టలు పెరిగాయి. అయినా వత్సనాభుడు తపస్సు మానలేదు. ఇంద్రుడు ఏడు రోజులు వర్షం కురిపించాడు. ఆ వర్షానికి పుట్ట పైభాగం కూలిపోయింది. వత్సనాభుడు ఏమాత్రం పట్టించుకోకుండా తపస్సు చేసుకుంటున్నాడు.

ఈ విధంగా తపస్సు చేస్తున్న వత్సనాభుని ధర్మనిరతికి " ధర్ముడు" ఆశ్చర్యపోయాడు. వెంటనే పెద్ద మహిష రూపాన్ని పొంది వత్సనాభుని తలపై వర్షం పడకుండా నిలబడి ఉన్నాడు. వత్స నాభుని ఆశ్రమం చుట్టూ వర్షం నీటిలో మునిగిపోయి ఉంది. వత్సనాభుడు ఆశ్చర్యంగా పైకి చూసాడు.

తనపై వర్షం పడకుండా రక్షిస్తున్న మహిషాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. ఈ మహిషికి దీర్ఘాయువు కలగాలని ఆలోచించి, తపస్సు చేసుకుంటున్నాడు.

ఈ విషయం తెలుసుకొని మహిషి ఆనందించింది. వత్సనాభునికి తపస్సు మీద ఏకాగ్రత కుదరటం లేదు. ఎందుకు ఇలా జరుగుతోంది అని వత్సనాభుడు ఆలోచించాడు. వర్షంలో తడుస్తున్న నన్ను రక్షించిన మహిషానికి కృతజ్ఞత చూపలేదు. కృతఘ్నత పెద్దదోషం. ఆ దోషం పోగొట్టుకోవడానికి ఆత్మహత్యే శరణ్యం అని భావించి మేరు పర్వతాన్ని ఎక్కాడు. కొండ శిఖరంపై నుండి దూకి ఆత్మహత్య చేసుకోవాలని వత్సనాభుడు అనుకున్నాడు. " తొందర పడకు" అంటూ ధర్మం మహిష రూపాన్ని విడిచి ప్రత్యక్షమయింది.

" వత్సనాభా! దేహత్యాగం చేయాలనే నీ అభిప్రాయాన్ని అభినందిస్తున్నాను. నీవు దేహత్యాంగం చేయక. మరొక ఉపాయం చెబుతాను. గంధమాదన పర్వతం మీద శంఖు తీర్థం ఉంది. అక్కడ స్నానం చేయి. నీ మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. ముక్తిని పొందుతావు. కృతజ్ఞుడవు అవుతావు" అని ధర్మం చెప్పింది. వత్సనాభుడు వెంటనే బయలు దేరి శంఖు తీర్థంలో స్నానం చేసాడు. అతని మనస్సు నిర్మలమయ్యింది. బ్రహ్మ లోకానికి చేరుకున్నాడు.

శంఖు తీర్థాన్ని సేవించడం వలన కృతఘ్నుతా దోషం పోయి ముక్తులవుతారు. మాతాపితరుల ఋణం, గురు రుణం, తీర్చని వారు ఇక్కడ స్నానం చేస్తే పాపం నుండి విముక్త లవుతారు. ఈ అధ్యాయం చదివితే కృతఘ్నుతా దోషం నుండి విముక్తులవుతారు. బ్రహ్మ లోకానికి చేరుకుంటారు. ముక్తి పొందుతారు.

స్కాందపురాణంలోని బ్రహ్మఖండంలోని సేతు మాహాత్మ్యంలో శంఖ తీర్థ ప్రశంస అను ఇరవై ఐదవ అధ్యాయం సమాప్తం.

# ప్రజాస్వామ్యమా నీవెక్కడ?



ఎలక్ట్రాన్

మూడవసారి రాష్ట్రంలో ఎన్నికలొచ్చాయి. ప్రచారాలు మహాజోరుగా సాగుతున్నాయి. కేటాయింపు అభయాలు, ఉచిత సదుపాయాల వాగ్దానాలు, వరదల్లా ఉప్పొంగిపోయాయి. రాష్ట్రావతరణకు కారణభూతుడైన నాయకుడు తెలుగునేలను నిలువునా చీల్చి, కాకతీయులు ఏలిన నేలను పునరావిర్భావం చేసి తాను రెండో ఎన్నికల తర్వాత కూడా మరో అయిదేళ్లు చక్రం తిప్పడానికి నిశ్చయించుకొన్నాడు. గత పదిసంవత్సరాల వ్యవధిలో రాష్ట్రాభివృద్ధికి తాను చేబట్టిన, చేబట్టబోయే ప్రణాళికలను ప్రజల ముందుంచుతూ ఎన్నెన్నో ఉపన్యాసాలు తెలుగులో, హిందీలో, ఆంగ్లంలో కూడా వర్షపు జల్లుల్లా కురిపించాడు.రాష్ట్ర ప్రయోజనలకోసం క్షేమార్థమంటూ స్వస్థానంలో భారీ యజ్ఞయాగాలు చేశాడు. పూజలు నిర్వహించాడు. ఆలయ పునరుద్ధరణలు చేశాడు. మొదటి రెండు ఎన్నికలకుముందు వాగ్దానం చేసిన వేలకొద్దీ ఉద్యోగాల సంగతి ఎన్నికైనతర్వాత తను చేసిన ప్రసంగాలలో తలెత్తకుండా జాగ్రత్త పడ్డాడు. ఏది ఏమైనా కాలం ఆగదు కదా? మళ్లీ మూడోసారి ఎన్నికలు ఇట్టే వచ్చేశాయి. పార్టీ పేరులో మొదటి అక్షరాన్ని మార్చి దేశంలోని విపక్షనాయకులతో సంఘటితంగా చేతులు కలిపి రంగంలోకి దిగాడు. అనర్గళంగా మూడు నాలుగు భాషల్లో మాట్లాడగల తన సామర్థ్యం కూటమిలో గల ఇతర నాయకులకు లేదన్న విశ్వాసంతో, అదేకారణంగా తనకు దేశసారథ్యం కూడా దక్కుతుందన్న అప్రకటిత లక్ష్యంతో బరిలోకి



దిగాడు. ప్రస్తుత ఎన్నికల ప్రచారాలు మహాజోరుగా సాగుతున్నాయి.

ఈ హోరెత్తే ప్రచార సమయంలోనే ఒక ఆదివారంరోజున తోపుడుబండిమీద కూరలమ్మే కుమారస్వామి వచ్చాడు. శ్రీమతి సూర్యనారాయణమూర్తి గుడికి వెళ్లింది. ఆ సంగతి అతగాడికి చెప్పి “ఓ గంట పోయినతర్వాత రాకూడదా?” అన్నాను.

“బండిమీద చూడండి. కూరలన్నీనవనవలాడుతూ తాజాగా ఉన్నాయి. ఓ గంటసేపు తర్వాత రావడానికి నాకు ఇబ్బంది లేదు కానీ, తిరిగి మీయింటికి వచ్చేసరికి కొనేవారందరూ ఏరేసుకొంటారు. ఇప్పుడు మీకా అవసరం లేదు. తాజా సరుకు కాబట్టి కళ్లుమూసుకొని కొనెయ్యవచ్చు,” అన్నాడు. అతను చెప్పినదాంట్లో వాస్తవం లేకపోలేదు. స్వామి పదోతరగతి గట్టు ఎక్కలేక, గత ఇరవై ఏళ్లనుంచి ఈ కూరల బండిని వీధులమ్మట తిప్పుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. సరేననుకొంటూ ఓ నాలుగు రకాల కూరలు

అరకిలో చొప్పున కొని, పర్సు తీసి వంద అందించాను. పదిహేను రూపాయలు తిరిగిచ్చాడు. ఏకూర ఎంత ధరో నేను అడగనూలేదు, అతగాడు చెప్పనూ లేదు. తర్వాత తన బండి లౌడ్ స్పీకర్ని ఆన్ చేసుకొని కదిలాడు.

సరిగా రెండు గంటల తర్వాత తలుపు తట్టిన చప్పుడు వినిపించి, తలుపు తీశాను. కుమార స్వామి చెప్పులు విడిచి లోపల అడుగు పెట్టి ఓ ప్లాస్టిక్ సంచిలో కాస్త అల్లం, ఓ పావు కిలో పచ్చిమిరపకాయలూ అందించి నేలమీద కూర్చున్నాడు. "సాబ్! అమ్మవారి ఆలయండగ్గర అమ్మగారు కనిపించారు. 'అయ్యగారేంకొన్నారు, డబ్బులెన్ని ఇచ్చారు' అని అడిగారు. చెప్పాను. 'అఘోరించినట్లే ఉంది. అల్లం పచ్చిమిరపకాయలు కొనలేదా? సరే నువ్వు తిరిగి వెళ్ళేటప్పుడు ఆ రెండూ ఇచ్చి డబ్బులు తీసుకో. ఇక్కడే వరలక్షమమ్మగారి ఇంట్లో సామూహిక లలితాసహశ్రనామ పారాయణ జరుగుతోంది. నేనక్కడకే వెడ్తున్నాను. వచ్చేసరికి ఆలస్యం అవుతుందని అయ్యగారితో చెప్పు,'అని ఎవరో మరో ఆవిడతో కలిసి వెళ్ళిపోయారు."

"సరే1 అల్లం పచ్చిమిరపకాయలకి ఎంతివ్వాలి? అని అడిగాను.

"మీకిచ్చిన పదిహేనూ తిరిగిచ్చేస్తే చాలు సర్," అన్నాడు.

"టి తాగుతావా?" అనడిగాను. తలూపాడు కొద్దిగా మొహమాట పడ్తూ.

ఓ పది నిముషాల్లో రెండు టి కప్పులతో హాల్లోకి వచ్చి, ఒకటి స్వామికి అందించాను.

''ఓటెవరికి వేస్తావు?" అడగకూడదనుకుంటూనే ప్రశ్నించాను.

"ఇటలీ అమ్మపార్టీకి వేస్తాను," అన్నాడు." "అదేమిటి! పదేళ్లపాటు పాలించి, యాదగిరి గుట్ట స్వామి ఆలయాన్ని తిరుపతికి పోటీగా పునర్నిర్మాణం కావించి, ఎన్నో చిన్నా, పెద్దా పరిశ్రమలు రప్పించిన ప్రభుత్వానికి వెయ్యవా?" అన్నాను

"ఆయన ప్రయత్నం వలన మాకు వేరు రాష్ట్రం రాలేదు. ఇటలీ అమ్మ కరుణవల్ల మాకు రాష్ట్రం వచ్చింది! అందుచేతనే ఆ అమ్మ పార్టీకి వెయ్యాలి, వేస్తాను కూడా!" అన్నాడు.

నేను కాస్సేపు మౌనంగా ఉండిపోయాను ఏమనాలో తోచక. ఉన్నట్టుండి స్వామి అన్నాడు, "సాబ్!మీకు నిజం చెప్పేస్తున్నాను. నాలుగు పార్టీలవారొచ్చి ఓటుకింత అని సొమ్ములిచ్చి వెళ్ళిపోయారు. మా గూడెంలోనే ఉండే ఇటలీఅమ్మ పార్టీలోని మరో వ్యక్తి వచ్చి, ఇంకోసారి డబ్బులిచ్చి, 'మీకిదివరకే మా పార్టీతాలూకుమనిషి వచ్చి సొమ్ములందజేసి వెళ్లిపోయాడు. మీరు మన గూడెంలోనివారు కాబట్టి మీకు మరింత సొమ్మందిస్తున్నా. మీరెవరికి ఓటేశారో మాకు తెలిసిపోతుంది. జాగ్రత్త మరి!' అని హెచ్చరించి వెళ్లిపోయాడు. ఏంచేసేది సాబ్!" అన్నాడు.

"స్వామీ! ఊరి సరిహద్దులు దాటి వెళ్లని వారికి రాష్ట్ర, దేశ, ప్రపంచ పరిస్థితుల సంగతి తెలియదు. బలమైన కేంద్రప్రభుత్వం లేనిదే దేశ ప్రగతి, భద్రత సజావుగా నడవ్వు. అందుకని ఆలోచించి మరీ అడుగు వెయ్యాలి." అన్నాను. అటుతర్వాత ఒక ఇరవై నిముషాల పాటు మన దేశ చరిత్ర గురించి క్లుప్తంగా చెప్పాను కానీ, ఫలానా పార్టీకి ఓటేయ్యాలి అని చెప్పలేదు.

"సాబ్!మీరు దేశమంతా తిరిగిన వారు కాబట్టి మీరు తగిన అడుగే వేస్తారు. అందుచేత మీరెవరికి ఓటేస్తారో ఇప్పుడు నాకు తెలిసిపోయింది. వారికే మేమూ ఓటేస్తాము. కానీ ఒక షరతు! మీరు రైతుబజారుకు పరిగెత్తకుండా ఎప్పుడూ నావద్దే కూరలు కొంటామని వాగ్దానం చేయండి. నాధరలు ఒకటి రెండు శాతం కంటే ఎక్కువుండవని హామీ యిస్తాను. అమ్మగారితో కూడా చెప్పండి." అన్నాడు.

ప్రతి ఒప్పందంలోనూ షరతులు వర్తిస్తాయి మరి! అలాగే అన్నట్లు తలూపాను. అయితే నేను ఓటేసిన పార్టీ ఓడిపోయింది. స్వామి కూడా తన మాట ప్రకారం ఓటేశాడో, లేదో తెలియదు కానీ, నోట్ ఫర్ వోట్ ఉదంతంలో ఒక పాత్ర వహించిన నాయకుడి పార్టీ నెగ్గింది.ఇప్పుడు మేము రైతుబజారుకు వెళ్లొచ్చా, లేదా? అయితే మేము ఓటేసిన పార్టీ నెగ్గితేనే రైతుబజారు షరతు వర్తిస్తుందని నేను చెప్పడం మరిచానని ఇప్పుడనిపిస్తోంది.

***

# కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుడు

ముడుంబై వేంకటాచార్యులు



**కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుడు --11వ భాగం**

శ్రీ మన్నా రాయణుడు కలియుగం లో శ్రీ వేంకటేశ్వర స్వామిగా అవతరించడం( పుట్టడం ) గాదు, తాను ఉండే శ్రీ వైకుంఠం నుండి శ్రీ వేంకటాచల మునకు ప్రత్యక్షం గా వచ్చి చేరి శిలా రూపం గా మారారు . అందువల్ల ఈభూమి పై గల సకల భక్త బృందం దర్శించి తరించు టయే కాదు సకల దేవతలు కూడా అనేక రూపాలలో ఈకొండకు వచ్చి స్వామి వారిని దర్శించు కుంటూ ఉంటారుట. ఈవేంకటాచలాన్ని .బ్రహ్మాండ పురాణం లో పేర్లతో పిలుస్తారో వివరించుట జరిగింది .ఇందులో కొన్నింటికి ఆపేరు ఎలా వచ్చిందో గతంలోనే వివరించి చెప్పడం జరిగింది.అవి వేంకటాద్రి ,నారాయణాద్రి, శేషాద్రి , వృషభాద్రి, వృషాద్రి (వృషాద్రి, వృషభాద్రి కొంత మంది పెద్దలు సమాన అర్థాలు గా తెలియ జేశారు.కాని కొంత మంది పెద్దలు "వృషం"అంటే "ధర్మం " అని అర్థం తెలియ జేశారు.ఒక నాడు ధర్మ దేవత ఈ భూమి పై తన ధర్మ విస్తరణ కై ఈ పర్వతం పై తపస్సు చేసినదని తెలియ జేశారు.అందుచేతనే ఈ కొండకు "వృషాద్రి" అనే పేరు వచ్చిందని తెలియజేశారు.) అంజనాద్రి, వరాహాద్రి, జ్ఞానాద్రి (ఈ కొండ మీద ఉండే స్వామి యే కాదు ఈ కొండ సైతం జ్ఞానాన్ని అనుగ్రహించ గలదు గాన ఈ కొండను "జ్ఞానాద్రి"అన్నారు.),కనకాచలం(ఈ కొండను బంగారు కొండ గా కూడా పిలుస్తారు.),ఆనందాద్రి (ఈ కొండ ను చేరినవారి అందరి కోర్కెలు నెరవేర్చి ఆనందాన్ని అందించే కొండ గాన "ఆనందాద్రి" అన్నారు.), నీలాద్రి ("నీలుడు " అనే మునీంద్రుడు తపస్సు చేసి సిద్ధి పొందిన కొండ గాన నీలాద్రి అని కొంతమంది పెద్దలు తెలియజేశారు.మరి కొంతమంది పెద్దలు నీలాదేవి అనే తపస్విని తిరుమల తిరుపతి కొండ పై కి చేరి గొప్ప తపస్సు చేయగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారు ప్రత్యక్షమై నీలాదేవి తో నీ తపస్సు మెచ్చాను నీకేమి వరం కావాలో కోరుకో మన్నారు. నీలాదేవి స్వామి వారి కి నమస్కరించి నీ కొండ మీద క్రూర మృగముల తాకిడి ఎక్కువ గా ఉంది.ఈ కారణంగా అనేక మంది నీ భక్తులు నీకొండకు రావడానికి భయపడు తున్నారు.నీభక్తులకు క్రూర మృగాల భయం లేకుండా చేయుమని కోరింది. స్వామి తన "ధనుర్బాణాలతో "క్రూర మృగములను తరిమి తరిమి కొట్టి నీలాదేవి చెంతకు వచ్చి ఆమె తో ఇక నా భక్తులకు క్రూర జంతువుల భయం ఉండదని తెలియజేసి కాసేపు విశ్రాంతి గా నిద్రించారు.నీలాదేవి స్వామి వారి వైపు చూసింది. స్వామి కి ఒళ్ళంతా చెమటలు పట్టినట్లు గమనించి విసరడానికి ఏమీ లేక తన పైట కొంగు తో విసురు తూ స్వామి వారిని చాలా శ్రమ పెట్టానని వెక్కి వెక్కి ఏడుస్తూ బాధపడుతోంది. నీలాదేవి తన పైట కొంగు తో విసురుతూ స్వామి వారి ఆకర్షణీయమైన ముఖారవిందాన్ని చూసి ఆనందిస్తూ తలవైపు చూసింది . స్వామి వారి తలపై కొంత జుట్టు కనిపించ లేదు.

(ఇంకా ఉంది)

# పెంచలకోన



డా॥కె.రామానందం



శ్రీ జ్వాలా నృసింహమూర్తి, అహోబిలం నృసింహమూర్తి, మాలోల నృసింహమూర్తి, క్రోధ నృసింహమూర్తి, యోగానంద నృసింహమూర్తి, చత్రవటి నృసింహమూర్తి, పావన నృసింహమూర్తి అంటూ తొమ్మిది నామధేయాలతో దర్శనమిస్తున్న నృసింహస్వామి వారు శరణన్న భక్తులను తమ కృపా కటాక్ష వీక్షణాలతో కరుణిస్తున్నారు. ఈ నవనారసింహ మూర్తులలో చత్రవటి నృసింహస్వామి వారు వెలసిన క్షేత్రమే పెనుశిల. చత్రవటి అంటే గొడుగుల తీర్థమని అర్థం. ఆ పెనుశిల కోనకు సమీపంలోని భైరవకోనకు స్వామివారు వాహ్యాళికి వెళ్ళినప్పుడు ఋషులు వెండి గొడుగులు పట్టేవారట. అందుకే స్వామివారికి వెండి గొడుగుల వాడు అనే పేరుంది. ఇప్పటికీ బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులు గొడుగులను సమర్పించుకుంటుండటాన్ని చూడగలం. ఈ స్వామివారికే కొండి కాసులవాడన్న పేరు కూడా ఉంది. స్వామివారు చెంచులక్ష్మిని పెళ్లి చేసుకుంటున్నప్పుడు చెంచులు కోటి బంగారుకాసులను కన్యాశుల్కంగా కోరగా, కుబేరుని వద్ద అప్పుగా తీసుకున్న కాసులను చెంచులకు ఇచ్చి, అనంతరం అప్పు నుంచి బయటపడ్డాడని కథనం. అందుకే భక్తులు స్వామివారిని కొండి కాసుల వాడని పిలుచుకుంటారు. అలాగే ఈ క్షేత్రానికి పెనుశిల అనే పేరు రావడం వెనుక ఒక కథ చెప్పబడుతుంది. ఉగ్ర నరసింహమూర్తి పరిణయమాడిన చెంచిత ఆయనను పెన వేసుకున్నందున ఈ క్షేత్రానికి పెనుశిల అనే పేరు ఏర్పండిరదనీ, అదే కాలక్రమంలో పెంచలకోనగా స్థిరపడిరదని స్థానికుల కథనం. కృతయుగంలో సనకసనందాదులను, త్రేతాయుగంలో శ్రీరామచంద్రులను, ద్వాపరయుగంలో ద్రౌపది సమేత పాండవులను, ఈ కలియుగంలో అగస్త్య, కణ్వ, విశ్వామిత్ర, ఆదిశంకరులను బ్రోచిన దేవ దేవోత్తముడు ఈ పెంచలకోన స్వామి వారు.

స్థల పురాణం: పెంచలకోనకు సుమారు ఆరు మైళ్ళ దూరంలో గోనుపల్లి అనే గ్రామం ఉంది. అది ఈ గ్రామంలో నున్న గోపాలులు, తమ పశువులను పక్క ఉన్న కొండ ప్రాంతానికి



తోలు కెళ్ళి మేపుతుండేవారు. ఒకరోజు, ఆ గోపాలులలో ఓ పిల్లవాడి ముందుకు వచ్చి నిలబడిన ఓ వృద్ధుడు దూరంగా రెండు శిలలను చూపిస్తూ ఒకటి అయ్యవారిదని, మరొకటి అమ్మవారిదని చెప్పాడు. అనంతరం ఆ పిల్లవాడితో వెనుతిరిగి చూడకుండా గ్రామానికి వెళ్ళి, ఈ విషయం గురించి గ్రామస్థులకు చెప్పమన్నాడు. ఆ వృద్ధుని మాటలననుసరించి గ్రామానికి బయలుదేరిన బాలుడు, కొంత దూరం వెళ్ళిన తరువాత, తన గొర్రెల కోసం అసంకల్పితంగా వెనక్కి తిరిగి చూసాడు. అంతే ! ఆ మరుక్షణమే ఆ బాలుడు శిలగా మారిపోయాడు. శిలగా మారిపోయిన బాలుడు దుఃఖిస్తూ ''స్వామి నీ కార్యభారముపై వెళుతున్న నన్ను ఇలా శిలాకృతిగా మార్చడం భావ్యమా? అని దు:ఖించసాగాడు. అప్పుడు అతని ముందు నిజరూపంలో దర్శనమిచ్చిన స్వామివారు. ''బాలకా! గత జన్మలో నువ్వు నాకు అత్యంత ప్రియ భక్తుడవు. నీ పూర్వజన్మ పుణ్యఫలం వలన సాయూజ్యమూర్తిపై నాలో ఐక్యమయ్యావు. పెంచలకోనకు వచ్చిన భక్తులు నిన్ను దర్శించుకున్న తర్వాత నన్ను దర్శించుకోవాలి అప్పుడే వారికి ఆ క్షేత్రాన్ని దర్శించుకున్న ఫలం దక్కుతుంది అని చెప్పి అంతర్ధానమయ్యాడు. సాయంత్రం పిల్లవాడు లేకుండా గొర్రెలు ఇంటికి చేరడంతో అతని తల్లిదండ్రులు ఆందోళన చెంది, అన్నిచోట్ల వెదకసాగారు. వారికి గ్రామస్తులు కూడా తోడయ్యారు. ఆ అటవీ ప్రాంతమంతా వెదికి వెదికి అలసిపోయిన గ్రామస్తులు నిరాశతో తిరిగి వస్తుండగా ఆ బాలుడు శిలగా మారిన వైభవాన్ని గ్రామస్తులకు విశదీకరించిన స్వామి వారు, బ్రహ్మోత్సవ సమయంలో ఆ బాలునికి పూజలు చేయాల్సిందిగా ఆనతి యిచ్చాడు. ఆ విధంగా పెంచలకోన స్వామి వారి ఆత్మ భక్తుడైన పెంచల గోపబాలుడు, శ్రీశైలంలో సాక్షి గణపతిలా, వారణాసిలో కాలభైరవునిలా, తిరుమలలో వరాహస్వామిలా, పెంచలకోనకు వచ్చే భక్తులు ప్రప్రథమంగా దర్శించుకోవలసిన భాగ్యాన్ని పొందాడు. కొన్నాళ్ల తర్వాత ఆంధ్ర చోళ సామంతుడు పరగణాల నాయకుడైన నూతలపాటి లక్ష్మీనరసింహ నాయకునికి కలలో కనిపించిన స్వామివారు తాను పెనుశిలపై వెలసి ఉన్నానని

చెప్పగా, రాత్రికి రాత్రే నాయకునితో పాటు ఆ గ్రామ ప్రజలంతా పెనుశిలను జేరుకున్నారు. అక్కడక్కడ ఆకాశవాణి, దగ్గర్లో ఉన్న మర్రి చెట్టు కింద నిరాకృతిగా కనిపిస్తున్న శిల బిల్ల లక్ష్మి సమేత పెనుశిల (చత్రవటి) నృసింహ స్వామి వారని, కణ్వ ముఖ తీర్థానికి అవతల నున్న శిల శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారిదని తెలిపింది. వెంటనే స్వామివారికి శాస్త్రోక్తంగా పూజలు జరిపించి ఆలయ నిర్మాణాన్ని గావించారు. క్షేత్ర ప్రాశస్యం: శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి వెలసిన పెంచలకోన కొండల ప్రాంతం తిరుమల నుండి శ్రీశైలం వరకు సర్పాకారంగా వ్యాపించి ఉన్న పర్వత పంక్తిలో ఉంది. పాములా మెలికలు తిరిగిన ఈ పర్వత పంక్తి తలభాగాన్ని శేషగిరి అని, మధ్యభాగాన్ని గరుడ గిరి అని, చివరి భాగాన్ని శ్రీ గిరి అని అంటారు. శేషగిరి పై తిరుమల శ్రీ వెంకటేశ్వరుడు, గరుడగిరిపై పెనుశిలేశుడు. శ్రీగిరి పై మల్లికార్జునుడు కొలువైయున్నారు. ఈ అమరిక సృష్టి లయలకు ప్రతీక అని అంటారు. చెంచులక్ష్మి నరసింహస్వామి వార్ల పరిణయం జరిగిన ప్రదేశంగా, సప్తర్షుల తపోభూమిగా, మేనక విశ్వామిత్రుల కలుసుకున్న స్థలంగా, శకుంతలా దుష్యంతుల ప్రణయ భూమిగా, భారత చక్రవర్తి భరతుని బాల్య క్రీడావనిగా ఈ పెంచలకోన క్షేత్రం సుప్రసిద్ధం. అలాగే నహుష చక్రవర్తి చేతిలో ఓటమిపాలై పదవిని కోల్పోయిన ఇంద్రుడు ఇచ్చట లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకుని తన ఇంద్ర పదవిని పొందాడట. స్వామివారు ఎంతో మహిమాన్వితుడైనందున పురాణ కాలం నుండి ఇప్పటివరకు ఎందరో భక్తులు స్వామిని దర్శించుకుని పునీతులయినారు. పెంచలకోనకు చేరుకున్న భక్తులు, ముందుగా క్షేత్రపాలకుడైన ప్రసన్నాంజనేయ స్వామి వారిని దర్శించుకుంటారు. దట్టమైన అడవిలో భక్తులను క్రూరమృగాల నుండి కాపాడేది ఆంజనేయ స్వామివారే అనంతరం స్వామి దర్శనానికి ముందు గోపబాలుడిని దర్శించుకుంటారు. తదనంతరం ప్రధాన ఆలయంలోకి ప్రవేశించిన భక్తులకు గర్భగుడికి ఇరువైపులా జయ విజయల శిలా ప్రతిమలు కనిపిస్తాయి. గర్భ



గృహంలో స్వామివారు నిరాకారుడై శిలా రూపంలో దర్శనమిస్తారు. రెండు శిలలు పెనవేసుకున్నట్లుగా పెనుశిల స్వామివారి భక్తుల కోరికలను ఈడేర్చుతున్నారు. స్వామివారి పాదాల చెంత అగస్త్యముని తీసుకొచ్చిన సాలగ్రామాలు ఉన్నాయి. గర్భ గృహంలో దశావతార దృశ్యాలు, విశ్వక్సేనుడు, ప్రహ్లాద నారదలు, దక్షిణామూర్తులను దర్శించుకోవచ్చును. స్వామివారి పాదాల చెంత అగస్త్యముని అలాగే ఆలయానికి ముందు ముకుళితహస్తుడైన గరుత్మంతుని చూడగలం. స్వామివారి ఆలయానికి కాస్తంత దూరంలో చెంచులక్ష్మి అమ్మవారి దేవస్థానం ఉంది. సంతాన భాగ్యాన్ని కోరుకునే స్త్రీలు పచ్చని వస్త్రాలను ధరించి, అమ్మవారి ఆలయం ప్రక్కనున్న సంతానలక్ష్మి అనే మర్రి చెట్టుకు చిన్న చిన్న ఊయలలను కట్టి మొక్కుతుంటారు. అద్భుత విషయాలు: పెంచలకోన ఆలయానికి సంబంధించిన అద్భుతాలకు కొదవలేదు. ఉదాహరణకు స్వామివారు నిత్యం స్నానమా-

చరించే నృసింహ కుండం మధ్య భాగంలో నలు చదరమైన ఓ రాతి బండ ఉంది. ఆ కొలనులో స్నానమాచరించి స్వామి, కాసేపు రాతిబండపై కూర్చొని, ఆ కొలను ఎదురుగా ఉన్న గుహలోకి వెళ్ళిపోతారట. ఆ స్వామి స్నానం ఆచరిస్తున్న సమయంలో దేవతలంతా దివ్యమైన గొడుగు పట్టారట. అందుకు ప్రతికగా ఇప్పటికీ బ్రహ్మోత్సవాలకు ముందు వైశాఖంలో సూర్యోదయం తర్వాత వెండి గొడుగు ఆకారం ఈ ప్రాంతంలో కనబడుతుందని స్థానికులు చెపుతున్నారు. ఆయన గుహలోకి వెళ్లిన గుర్తులుగా ఆ గుహ ముఖద్వారం వద్దనున్న రాళ్లమీద ధూళిపై ఆయన పాద ముద్రలు కనిపిస్తాయట. ఇప్పటికీ దివి నుంచి భువికి దిగివచ్చే దేవతలు స్వామివారిని అర్చించుకుంటారని జనకృతి. అందుకు తార్కాణంగా అర్ధరాత్రి పూట స్వామి వారి కోవెల నుండి వేద ఘోషలు, గుడిగంటలు శబ్దం వినిపిస్తుంటాయి. ఆ స్వామిని పోతన, తిక్కన, ఎర్రన, త్యాగయ్య, కేతన, గోపన్న, గోగులపాటు కూర్మానాధుడు, గాజుల పురుషోత్తమ కవులు వంటి ఎందరో మహానుభావులు కీర్తించారు. పిల్లలమర్రి పినవీరభద్రుని 'శృంగారశాకుంతలం'లో, కాళిదాసు మహాకవి 'అభిజ్ఞానశాకుంతలం'లో ఈ క్షేత్ర ప్రస్తావన ఉంది. అదేవిధంగా అగస్త్యముని ఈ క్షేత్రంలో కొంతకాలం పాటు నివశించి స్వామిని సేవించుకున్నారు. ఇక కణ్వ మహర్షి ఏకంగా ఇక్కడే ఒక ఆశ్రమాన్ని నిర్మించుకొని శకుంతలను పెంచి, పెద్ద చేశాడని ప్రతీతి. ఇక్కడ కణ్వ మహర్షి సృష్టించగా అవి ఆయన పేరు మీదగా 'కణ్వఏరు' గా పిలవబడి, ప్రస్తుతం 'కండలేరు'గా పిలవబడుతుంది. ఈ క్షేత్రంలో కొంతకాలం పాటు బస చేసిన జగద్గురు ఆదిశంకరాచార్యులవారు, స్వామిని సేవించుకుంటూ నారసింహ యంత్ర ప్రతిష్ట చేసి 'కరావలంబ' స్తోత్రాన్ని ఆలపించారని స్థల పురాణం ద్వారా మనకు తెలుస్తుంది. ఇటువంటి అద్భుత విశేషాలెన్నో. స్వామి దర్శన నిమిత్తం అన్యమతస్థులు కూడా వస్తుంటారు.

పూజలు ఉత్సవాలు: పాంచరాత్రాగమానుసారం స్వామివారికి పూజలు జరుగుతుంటాయి. వైశాఖ మాసంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఐదు రోజులపాటు అత్యంత వైభవోపేతంగా జరుగుతాయి. వైశాఖ శుద్ధ ద్వాదశి ఉదయం ప్రారంభమయ్యే జయంతోత్సవం వైశాఖ బహుళ విదియ ధ్వజావరోహణంతో ముగుస్తుంది. పెళ్ళి ఆలస్యమవుతున్న యువతీ యువకులు స్వామివారి, అమ్మవారి అక్షింతలు తలపై ధరిస్తే, వెంటనే వివాహం నిశ్చయమవుతుంది. స్వామి వారి రథోత్సవ సమయంలో భక్తులు తమ శరీరంపై ఉన్న పులిపిరులు పోయేందుకు రథంపై మిరియాలు చల్లడం పరిపాటి. ఆ స్వామివారికి పూజలు చేస్తే, భూతప్రేత బాధలతో ఉన్నవారు గ్రహ బాధల నుండి వేసారిపోయిన వారందరికి విముక్తి కలుగుతుందని ప్రతీతి.

ఎక్కడుంది, ఎలా వెళ్లాలి: పెంచలకోన క్షేత్రం, నెల్లూరు జిల్లా రావుల మండలంలో నెల్లూరు, కడప జిల్లాల సరిహద్దు ప్రాంతంలోని కీకారణ్యం మధ్యలో, సముద్రమట్టానికి 3662 అడుగులు ఎత్తైన పీఠభూమిపై ఉంది. విజయవాడ, చెన్నై రైల్వే మార్గంలో నెల్లూరు రైల్వే స్టేషన్‌లో దిగి, అక్కడ నుంచి బస్సులో ప్రయాణం చేసి పెంచలకోన చేరుకోవచ్చును. యాత్రికుల బస్సు సౌకర్యార్థం అనేక సత్రాలు ఉన్నాయి. ఉచిత భోజన సదుపాయం ఉన్నది.


జై నారసింహా

# ఒకసారి గాంధీజీ గతంలోకి ...

డాక్టర్ . చిలకమర్తి దుర్గాప్రసాదరావు



అవి ఆంగ్లేయులు అరాచకంగా మన దేశాన్ని పరిపాలిస్తున్న రోజులు. అప్పుడే గాంధీజీ లండన్ లో బారిష్టర్ డిగ్రీ పుచ్చుకుని స్వదేశం తిరిగొచ్చారు. గుజరాత్ కు సంబంధించిన కొంతమంది వర్తకులు దక్షిణాఫ్రికాలో ఉంటున్నారు. వారి లావాదేవీలు పరిష్క రించడానికి వారు గాంధీజీని పిలిస్తే వారి పిలుపు మేరకు గాంధీజీ అక్కడకు వెళ్ళారు. వారి ఇంటికి ప్రతి రోజు ఎన్నో పనులపై ఎంతో మంది వ్యక్తులు రావడం, వారికి గాంధీజీ ఆశ్రయం ఇవ్వడం ఆయన ఆహార, పానీయా లిచ్చి సేవలు చెయ్యడం ఒక రివాజు. ఇది భారతీయ సనాతన ధర్మం కూడ. ఒక రోజు ఆయన ఇంటికి ఒక వ్యక్తి విదేశాల నుండి వచ్చాడు. మరునాడు వెళ్ళిపోయాడు. ఇక ఆ కాలంలో ఇప్పటిలా మెరుగైన మరుగుదొడ్లు ఉండేవి కావు. ఒక గొయ్యి తీసేవారు. ఆ గోతిలో ఒక డబ్బా, ఆ డబ్బాకి పై నుండి పట్టుకునే ఒక కొక్కెం అమర్చి ఉంటుంది. అందులో మల విసర్జన చేసిన ప్రతివ్యక్తి దాన్ని తీసి బయట పారవెయ్యాలి. అది నియమం. కానీ ఆ రోజు వచ్చిన వ్యక్తి ఆ విషయాన్ని మరచి పోవడమో మరేదో జరిగింది. ఆయన వెళ్లి పోవడం కూడ జరిగిపోయింది. గాంధీజీ ఆ పని చెయ్యమని తన భార్య శ్రీమతి కస్తూరిబా గాంధీకి చెప్పారు. ఆమె ససేమిరా ఒప్పుకోలేదు. అది మీకు సంబంధించిన పనైతే తప్పకుండా చేస్తాను. కాని అది ఎవరో తెలియని అతిథికి సంబంధించినది. నేనాపని చెయ్యలేను, చెయ్యను గాక చెయ్యను అని ఖరాఖండిగా చెప్పేసింది.



దాంతో గాంధీజీ అహం దెబ్బ తింది. ఆమెను గట్టిగా కొట్టి బయటకు గెంటేసి తలుపులు వేసేశారు. ఆమె గాంధీజీతో 'మీకు నన్ను కొట్టే హక్కు ఉంది, కానీ దేశం కాని ఈ దేశంలో నన్ను ఇంట్లోంచి గెంటి వేసే హక్కు మాత్రం లేదు, మన దేశం ఐతే తెలిసిన వారింటికి వెళ్ళి తలదాచుకుంటాను, ఇక్కడ ఆ అవకాశం లేదు, దయ జేసి మర్యాదగా తలుపు తీయండని' గట్టిగా అరిచింది.

హఠాత్తుగా గాంధీజీ తాను చేసిన ఆవేశ పూరితమైన పనికి పశ్చాత్తాపం పొందారు. గాంధీజీ జీవితంలో భార్యపై చేయి చేసుకోవడం అదే మొదటి సారి, అదే చివరిసారి కూడ.

ఆయన పశ్చాత్తాపం ఊరికే పోలేదు. అది కార్య రూపం ధరించింది.తదనంతరకాలంలో Village sanitation అనే ఉద్యమానికి బాటలు వేసింది. ఆ తరువాత ఆయన గ్రామీణ పారిశుద్ధ్యానికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. Instead of having

graceful hamlets dotting the land, we have villages looking like dung heaps. it is the duty of everyone to make the villages models of cleanliness in every sense of the word అన్నారు. అక్కడితో ఆగలేదు The first and foremost service is latrine-cleaning (प्रथम सेवा पाखाना सफाई है) అని దాన్నొక జీవితాదర్శంగా మలుచుకున్నారు.

ఇక స్వాతంత్ర్యం వచ్చి అందరు డిల్లీ లో ఆనందంగా సంబరాలు జరుపుకుంటూ ఉంటే ఈయన నౌఖాలీ లో అంటే పూర్వం నవ-ద్వీపం అని చెప్పుకునే వాళ్ళం అక్కడ మరుగుదొడ్లు శుభ్రం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇక మన ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ మహాత్ముని చిత్ర-పటానికి వందనాలు సమర్పించి ముందుకు సాగడం మనలో చాల మంది గమనించిన విషయమే. అంతే కాకుండా మరో అడుగు ముందుకేసి What is true of outer cleanliness is true of the inner too అనే మహాత్ముని ఆశయానికి ఊపు అందించడం కోసం కేవల బాహ్యమైన శుద్ధితో పాటుగా అంతర్గతంగా కూడ భారతదేశాన్ని శుద్ధి చేయడానికి పూనుకోవడం మన భరత జాతి చేసుకున్న పురాకృత సుకృతం. ఈ విధంగా తాను ఆవేశంతో, అనాలోచితంగా చేసిన తప్పును దిద్దుకోవడమే కాక దాన్నొక ఆదర్శంగా ఉద్యమం-గా మార్చి స్వయంగా ఆచరించి అందరికి ఆదర్శంగా నిల్చిన మహాత్ముడు సమస్త మానవ జాతికి ఆదర్శం అనడంలో ఎటువంటి సందేహం లేదు. "స్వాతంత్ర్యంమునకై తెగించి తన సర్వస్వమ్ము కోల్పోవు నే పూతాత్ముండతడొక్కడే త్రి-భువనీ పూజ్యుండు" అని శ్రీ యేటుకూరి వేంకట నరసయ్య గారు వేరొక ఏదో సందర్భంలో చెప్పినా అది మహాత్మునకు వర్తి-స్తుంది అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఏది ఏమైనా If humanity is to progress, Gandhi is inescapable. ... we may ignore him at our own risk. అన్న Dr. martin Luther King, Jr. మాటలు రతనాల మూటలు., అభ్యుదయం కోరు కునే వారికి బంగారు బాటలు.

## అత్యున్నత ప్రజ్ఞ జాగృతం కావాలి..

(38 వ పేజీ తరువాయి)

ఆశ.. ఆశయానికి దూరం చేస్తుంది.

స్వార్ధం.. విజ్ఞతకు మసిపూస్తుంది. ఆధిక్యతాభావన ఇతరుల యందు తప్పులు వెదికే నైజాన్ని ప్రదర్శిస్తుం-ది. విజయానికి అడ్డదారులు వెదికే గుణం విలువలను పాతరేస్తుంది. అయినా ప్రపంచంలో మంచితనం సానుకూల వైఖరి తమ అస్తిత్వాన్ని చాటుతూనే ఉంటాయి. వ్యక్తిలో ఉత్తమత్వాన్ని ఆవిష్కరించుకునే తృష్ణ, తపన, జిజ్ఞాస భగవచ్ఛక్తిని ప్రకటితం చేస్తూనే ఉన్నది. దార్శనికత అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తుంది. ప్రేమత-త్వం పంచుకోమంటుంది. భౌతిక జీవితమనే వృక్షానికి ఆధ్యాత్మిక ఫలాలు కాస్తాయి.. ఆనందదాయకము, విశ్వాసనీయము, పారదర్శకమునైన మాటలు, సకారాత్మక ఆలోచనలు, ఉదాత్తమైన సంకల్పాలు, సమున్న-తమైన సౌహార్ద్రతాభరితమైన ఆత్మీయతలు, నిర్మలమైన దృక్కోణాలు, ఆలోచనాత్మకమైన భావనలు, అభ్యు-దయానికి ఉపయుక్తమైన చింతనలు వ్యక్తిలో.. పల్లవిస్తూ సత్సమాజావిష్కరణకు బీజం వేస్తాయి. భౌతిక జీవితంలో ప్రేయస్సు, పారలౌకిక జీవితంలో శ్రేయస్సు అందుతుంది.. అదే వ్యక్తి ముక్తికి కారణమౌతుంది. అంతశ్చేతనలో అత్యున్నత ప్రజ్ఞ జాగృతం కావాలంటే.. వ్యక్తిలో పరిణతి వెలుగు చూడాలి.. దానికి అక్షరాస్యత ఆలంబన కావాలి.. పత్రికలకు ఆ కార్య నిర్వహణలో బాధ్యత అధికంగా ఉంటుంది.

పాలకుర్తి రామమూర్తి

# మధుర స్వప్నం

ఉషారాం



(గత సంచిక తరువాయి)

ఆనందంగా రోజులు గడిచిపోతున్నాయి.

చల్లని వెన్నెల రాత్రులలో ఆమె ఒళ్ళు తల పెట్టుకుని ఈ మల్లెల సౌరభంతో వీచే గాలులలో నీతో సమయం గడపడం చాలా అదృష్టం ఇదే స్వర్గం అని భర్త అంటుంటే వసుధకు హాయిగా అనిపించింది. చుట్టుపక్కల పేద పిల్లలను చేరదీసి పాటలు పద్యాలు నేర్పడం ముగ్గులు అల్లికలు లాంటివి, వారితో ఆటపాటలతో గడపడం చేస్తూ, మావయ్య గార్ని,అత్తయ్య గార్ని గుడికి తీసుకు వెళ్లడం సాయంత్రం పూట భాగవత రామాయణాలు చదివి వినిపించేది.

కథ వింటున్న పిల్లలు నిద్ర వస్తున్నట్లు తూలుతున్నారు. మళ్లీ రేపు వస్తాను మిగిలిన కథ చెప్తానంటూ పిల్లల్ని ఇంట్లోకి పంపి రాధిక తను కలిసి ఇంటికి వచ్చేసారు. అలా తనకు వీలైనప్పుడల్లా పిల్లల్ని చేరదీస్తూ తమ పిల్లలతో పాటు వారికి రామాయణం చెప్పడం పూర్తి చేసింది.

మాధవి అత్తగారు చాలా తక్కువగా మాట్లాడుతారు. ఇలా జరగడంతో, ఆవిడ పరిస్థితిని జీర్ణించుకోలేక ఎక్కువ సమయం పూజ గదిలోనే గడుపుతున్నారు. భర్త విజయ్ ఏదో ఒక సమయానికి రావడం తిండి పట్ల, పిల్లల పట్ల శ్రద్ధ చూపించడం లేదు. మాధవి తల్లి రెండు నెలల నుంచి ఇక్కడే ఉండి పిల్లలు సంగతి చూసుకుంటున్నారు. స్కూల్ కి సెలవులు ఇస్తే, వాళ్లని తీసుకెళ్తానని చెప్పారు. స్కూలు జరిగే సమయంలోనైనా పిల్లలు మాధవి గురించి మర్చిపోతారని స్కూలుకు పంపుతున్నారు. ఇంతలో దీపావళి పండగ వచ్చింది. వసుధా,రాధిక కలిసి పిల్లలకు టపాసులు కొనుక్కొచ్చి ధన త్రయోదశి రోజు అనాధాశ్రమానికి తీసుకెళ్లి, అక్కడి పిల్లలకు వీరితో టపాసులు, మిఠాయిలు ఇప్పించి పండుగ జరిపించారు. వారి ముఖాల్లోని ఆనందం మతాబుల, కాకరపువ్వొత్తుల, చిచ్చుబుడ్ల వెలుగుల కంటే ఎంతో గొప్పగా అనిపించింది. పిల్లలు మాధవిని అడుగుతున్న ఏదో ఒకటి చెప్పి వాళ్లని మాటల్లో పెట్టి మరిపిస్తున్నారు. వసుధా, రాధిక సహాయ సహకారాలతో కూడిన మమత అనురాగం పిల్లలకు ఎంతో ఊరట ఇచ్చింది. వాళ్లు వసుధా వాళ్ళతో అన్ని విషయాలు మాట్లాడడానికి, సందేహాలు అడగడానికి అలవాటు పడ్డారు.

ఆమె శ్రద్ధకు, ఓపికకు వాళ్లు చాలా సంతోషపడేవాళ్లు. నువ్వు మా ఇంటి మహాలక్ష్మివి, దేవీవరప్రసాదనివి అనేవాళ్లు. పేద పిల్లలకు పుస్తకాలు, పెన్నులు లాంటివి కొని పెట్టి, అక్షరాల దిద్దించడం లాంటివి చేస్తుండేది. వారిలోన నేర్చుకునే ఆసక్తిని గమనించి ఎలా పాటలు,పద్యాలవి పాడాలో చెప్పేది. వాళ్లు కూడా అక్క అక్క అంటూ కూడా తిరుగుతూ ఉండేవాళ్ళు. వాళ్ల కష్ట సుఖాలు చెప్పేవాళ్లు. పూలు కట్టడం, జాతీయ పండుగలకు జెండాలవి కాగితాలతో తయారు చేయడం, పువ్వులు తయారు చేయడం, మొదలైనవి నేర్పేది.

*******

వసుధ రాత్రి ఏడింటికి భర్త కోసం ఎదురుచూస్తూ తన గదిలో నిండు గోదావరి లాంటి పి.సుశీలగారి పాత పాటలు వింటూ హ మ్ చేస్తూ ఆనందంగా ఉంది. అప్పుడే తన స్నేహితురాలు రాధిక నుంచి ఫోన్ వచ్చింది. పాట ఆఫ్ చేసి సంగతేంటని అడిగింది.

(సశేషం)

# గజేంద్ర మోక్షము



ఆచార్య డా. శనగవరపు కృష్ణ మూర్తి శాస్త్రి

పైట కొంగును సహితంబు వదలకుండ
నీ గురించిటు తలబోసె నీరజాక్ష
ప్రియ సఖుండెటు లెందుకు వెళ్ళెనేమొ
దీన స్త్రీలమొర విని యేతెంచె నేము –86

వేద చోరుల శిక్షించ వెడలె నేమొ
దానవులు దేవతల పైన దండ యాత్ర
జరిపి రేమొ, వారి కొరకు చనియె నేమొ
శత్రు మూకలు పతి యుండు జాడ కొరకు -- 87

భక్త కోటిని వేధింప వారికి తన
యునికి తెలపగ తా వెళ్ళి యుండెనేమొ
తడబడు చడుగులు పడును త్వరిత గతిన
మగని యడగగ జంకును, మరల వడిగ ---88

తగ్గు తొట్రుబాటును చెంది తలపులందు
తలమునకలై జడిమ భంగి తరలు చుండె
మాత తలపుల కందని మాధవుడివి
నిన్ను కొనియాడ తరమేన నెవరి కైన —89

కరిని కాపాడ కంగారుగ సిరి మాత
పైట కొంగు వదల లేదు పతి వెనుకనె
వెళ్ళు మాత మేఘంబుల వెంట చనెడి
మెరుపు తీగల బోలుచు మెరియు చుండె --90

పద్మ ముఖి కాన భ్రమరముల్ భ్రాంతి చెంది
ముసర జొచ్చె, పెదవులెరుపు గని దొండ
పండని భ్రమచెంది చిలకల్ వాలు చుండె
మీన ముల బోలు కనులుండు గాన నింగి –91

లోని మందాకినీ నది లోని మీన
ముల్ కనుల మ్రింగ నేతెంచె మూక లౌచు
కుచ ద్వయంబును తాకుటకు చను దెంచు
చక్ర వాక పక్షుల వచ్చె సంబరముగ ---92

యివ్విధముగ నొకటి ద్రోల నింకొకటిగ
గెలచి శ్రీలక్ష్మి నిను జేరి కిమ్ము జెందె
యట్టి దృశ్యమానంద మయంబు గాద
యసురు లాయుషును హరించు హరివి నీవు --93

కరుణకుదధివి, భక్తుల కాసటీవు
మునుల మనముల దోచెడి మూర్తి వీవు
మాత శ్రీ దేవిని హృదయ మందు నిలిపి
పూజ లందెడి వైకుంఠ పుర నివాసి --94

వీవు, స్వప్రకాశంబువి విష్ణు వీవు
బ్రహ్మ రుద్ర దేవాదుల ప్రార్థనలను
స్వీక రించెడి వేల్పువి శ్రీయుతుడవు
యగ్గజేంద్రుని రక్షించు టందు మగ్న --96

మై సురలు చేయు ప్రార్థన లందు కొనక
యమిత వేగంబు తోడనీ వరగి నావు
మకరి కరియును పోరాడు మడుగు కడకు
కరి యార్తితో కరమున కమలధారి ---97

యగుచు నారాయణా కావు మనుచు వేడ
కరుణతో భీకరమగు చక్రమును విడవ
కనులు మిరుమిట్లను గొలుపు కాంతు లీని
నిప్పు రవ్వలు గ్రక్కుచు నెక్కొ నంగ --98

(సశేషం)






X-RAY కొల్లూరి (1956-2025)



రావు బాలసరస్వతి దేవి
1928-2025

RNI No. TELTEL/2011/39497 NOVEMBER 2025 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication:1st November Date of Posting:8th November




Published, Edited and Printed by T Shanti at Flat No. 504, Tower A06, Rajiv Sahabhavana Nagole-Bandlaguda, Hyderabad-500068. Phone 9490571297 email: teega51@gmail.com , www.chaitanyam.net, Printed at Planographers. 5-8-300. Chirag Ali Lane, Abids, Hyderabad-500001.